నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 27-2-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:160 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

చలి పరారు
ఎరుపెక్కిన రవి
కరెంట్ కష్టాలు.

విత్తనం మొక్క
విద్యార్థి పాఠశాల
నీరు టీచర్లు.

డాలర్ తళుక్కు
రుపాయి విలవిల
ధరల గోల.

చూడు నగరం
అంతా మూగ చెవిటి
పైసకు సలాం.

మోడి ప్రత్యూషం
కమల వికసితం
డిల్లీ ఉత్సాహం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఎనిమిది మంది కార్మికులు
చిక్కున్న సొరంగం !
ముందుకు సాగని బురదతొ
కార్మిక రణ రంగం !
నాలుగైదు రోజులైన
యెడతెగని ఉత్కంఠ !
గుండెల్లో కొట్టకుండ
ఆపండి యమగంట !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

జమ్మూ కశ్మీర్‌లో మళ్లీ రెచ్చిపోయిన ఉగ్రవాదులు

శ్రీనగర్, ఫిబ్రవరి 26: జమ్మూ కశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజౌరీ జిల్లాలోని నియంత్రణ రేఖ సమీపంలో ఆర్మీ జవాన్లను తీసుకు వెళ్తున్న ట్రక్‌ను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అయితే ఈ కాల్పుల్లో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. బుధవారం సుందర్‌బనీ సెక్టార్‌లో పాల్ గ్రామం వద్ద ఈ ఘటన చోటు చేసుకుందని వారు వివరించారు. అటవీ ప్రాంతంలో నక్కిన ఉగ్రవాదులు ఈ కాల్పులు జరిపారని చెప్పారు.

ఈ ప్రాంతం నుంచే జమ్మూ కశ్మీర్‌లోకి ఉగ్రవాదులు చొరబడతారని ఆర్మీ ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు భద్రతా దళాలు సైతం అదే సమయంలో ఉగ్రవాదులపైకి ఎదురు కాల్పులకు దిగాయన్నారు. ఈ కాల్పుల ఘటనపై ఆర్మీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. హుటాహుటిన భద్రత దళాలు రంగంలోకి దిగాయి. అందులో భాగంగా ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కోసం గాలింపుతోపాటు తనిఖీ కార్యక్రమాన్ని ముమ్మరం చేసినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు.గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి లోని పార్టీలు ఘన విజయం సాధించాయి. దీంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని గా మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోంది. అదే సమయంలో జమ్మూ కశ్మీర్‌లో రియానీ జిల్లాలోని శివ్ ఖోడీ ఆలయాన్ని సందర్శించుకొని.. కాట్రాకు యాత్రికులతో వెళ్తున్న బస్సుపై పోని ప్రాంతంలోని తెర్యాత్ గ్రామం వద్ద ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.ఉగ్రవాదుల కాల్పుల నుంచి తప్పించేందుకు డ్రైవర్.. బస్సు వేగాన్ని పెంచాడు. దీంతో ఆ బస్సు లోయలో పడిపోయింది. ఈ ఘటనలో పదిమంది యాత్రికులు అక్కడికక్కడే మరణించగా.. మరో 33 ప్రయాణికులు గాయపడ్డారు. ఆ నాటి నుంచి జమ్మూ కశ్మీర్‌లో ఎక్కడో అక్కడ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో పలువురు మరణిస్తున్నారు. మరోవైపు గతేడాది జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.అది కూడా ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఈ ఎన్నికలు జరగడంతో.. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి ఓటర్లు పట్టం కట్టారు. దీంతో ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

చురక

ఎన్నాళ్లని మతం కార్డు
ఎన్నికల్లో వాడుతారు
ప్రజలను ఓట్ల కొరకు
ప్రలోభాల్తో వేడుతారు
విశ్వాసం రాజకీయ
వింత సరుకు చేస్తారు
మభ్యపెట్టి విద్వేషం
మత్తుమందు పోస్తారు

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

కాలమును వెన్న జేయుచు
కాఠిన్యము నెరుగనట్టి కమ్మని భాషన్
పాఠముగా గ్రహియించి–మ
రాఠీ దినమును జరిపెడి ప్రజలను గొలుతున్!!

(ఫిబ్రవరి 27 మరాఠీ భాషా దినోత్సవం)

–రాధశ్రీ
సెల్:9494481210

తాళ్లపూడిలో విషాదం.. గోదావరిలో మునిగి అయిదుగురు విద్యార్థులు మృతి..

అమరావతి, ఫిబ్రవరి 26:మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు నదీస్నానాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలో నేటి ఉదయం విషాదం చోటుచేసుకుంది. తాడిపూడిలో గోదావరి స్నానానికి దిగిన ఐదుగురు యువకులు గల్లంతయ్యారు. . వీరిలో ముగ్గురు మృతిచెందగా మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది.

మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించక పోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతయ్యారు.

ఆ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారిలో టి. పవన్ (17), పి. దుర్గాప్రసాద్ (19), పి. సాయి కృష్ణ (19) మృతదేహాలు లభ్యమయ్యాయి. ఎ. పవన్ (19), జి.ఆకాశ్ (19) ఆచూకీ కోసం గాలిం కొనసాగుతోంది. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి, రాజమహేంద్రవరంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. వారంతా ఒకే గ్రామా నికి చెందిన వారు కావడం తో విషాదఛాయలు అలముకు న్నాయి. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ గాలింపు చర్యలను

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు.. కిక్కిరిసిన శివాలయాలు

కరీంనగర్, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు తరలివచ్చి మహాశివుడి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లిస్తున్నారు. ఆలయాల్లో స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శివనామస్మరణతో శివాలయాలు మారుమ్రోగుతున్నాయి. ఆలయాల వద్ద ఇలాంటి ఇబ్బందులు భక్తులు ఎదుర్కో కుండా పెద్ద ఎత్తున ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

వేములవాడతో పాటు ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు స్వామి వారి దర్శనం కోసం నాలుగు నుండి ఆరుగంటల సమయం పడుతుంది. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. పెద్దపల్లి శివాలయంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహిసున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఇల్లందుల కృష్ణ మూర్తి, నాళ్ళ విశ్వనాథ్, దక్షిణామూర్తి, అల్లంకి శ్రీనివాస్ తో పాటు పలువురు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ జిల్లాలోని పలు శివాలయాల్లో మహాశివుడిని దర్శించుకున్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎంపీని ఘనంగా సత్కరించారు.

సూడాన్‌లో కుప్పకూలిన విమానం
10 మంది మృతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:దక్షిణ సూడాన్‌లో మిలటరీ విమానం ఒకటి కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఖార్టూమ్ సమీపంలోని వాది సీద్నా ఎయిర్ బేస్ నుంచి మంగళవారం అర్ధరాత్రి రాత్రి ఆర్మీ ఫ్లైట్ బయలు దేరేందుకు సిద్ధమైంది. ఈ విమానం రన్‌వేపై పరుగులు పెట్టి టేకాఫ్ అవుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

ఈ ప్రమాదంలో మొత్తం 10 మంది మృతి చెందారు.

వారిలో ఆర్మీ అధికారులు, సాధారణ పౌరులు కూడా ఉన్నారు. ప్రమాద సమయంలో విమానంలో 20 మంది ఉన్నారు.. ఈ ప్రమాదం లో పలువురికి గాయాలయ్యాయి. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. విమానాశ్రయంలోని అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపు చేసి, పలువురు ప్రయాణికులను కాపాడారు. ఖార్టూమ్ సమీపంలోని వాది సీద్నా ఆర్మీ ఎయిర్ బేస్ లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో నుంచి గాయాలతో బయటపడ్డ ప్రయాణికులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రాథమిక దర్యాప్తులో విమానం టేకాఫ్ సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడం వల్లే ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలి.. దామోదర్ రాజనర్సింహ

మెదక్, ఫిబ్రవరి 26: రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల మహాశివరాత్రి జాతర సందర్భంగా వనదుర్గభవాని మాతకు రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టు వస్త్రాలు సమర్పించారు..

ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, ఆలయ ఈవో చంద్ర శేఖర్ ఘన స్వాగతం పలికారు. మంజీరా నది పాయలలో ఏర్పాటు చేసిన శివుడు, లింగం, గోవుల భారీ సెట్టింగ్. వద్ద మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు శ్రీకారం చుట్టారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించా రు. అమ్మవారి ఆలయంలో శివరాత్రి జాగారాలు, పూజలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు..

ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయని తెలిపారు. భక్తులు మెచ్చే కోరిన కోరికలు తీర్చే దేవతగా పిలవబడే వనదుర్గ అమ్మవారి జాతరకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పిల్లాపాపలతో జాతరకు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోతాయన్నారు. వనదుర్గ అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, జాగారాలు ఉండేందుకు భక్తులు చేరుకున్నారని వివరించారు. వీరంతా వనదుర్గ గుడి ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద బస చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, బస్సులు, విద్యుత్ దీపాలతో అలం కరణ, భక్తులకు త్వరగా దర్శనం కల్గించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ క్రమంలో ఏడుపాయల్లో భక్తుల రద్దీ నెలకొందని చెప్పారు. జాతర సందర్భంగా వనదుర్గా భవాని మాత ప్రధాన ఆలయాన్ని, మండపాన్ని, ధ్వజస్తంభాన్ని రంగు రంగుల పువ్వులతో శోభాయమానంగా అలంకరించాలన్నారు.

ఏడుపాయల మహా జాతర ప్రధానంగా మూడు రోజులు జరుగుతుంది. నేడు మహాశివరాత్రి, రెండో రోజు జాతర వేడుకల్లో ప్రధాన ఘట్టమైన బండ్ల బోనాలు ఊరేగింపు, మూడో రోజు ఆదివారం రథోత్సవం ఉంటాయన్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను కలెక్టర్ నేతృత్వంలో సంబంధిత ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీటి వసతి, టాయిలెట్లు, బస్సులు, హెల్త్ క్యాంప్ లు, గజ ఈతగాళ్లు ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి చంద్రశేఖర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

ప్రముఖ గజల్ కవి శ్రీ కాదుప్రోలు మోహనరావు విరచిత "ఎందెళ్ళో" మధుర గజల్ మాలిక కావ్యం, "ఎందెళ్ళో" అదియాల్లమ్మ ల..

ఆవిష్కరణోత్సవం

తేదీ: 08-03-2025 శనివారం
(ఉ.గం.10.00 నుండి గం. 13.00 వరకు)
వేదిక:
తెలంగాణ సారస్వత పరిషత్ హాల్, హైదరాబాద్
(కోఠీనుండి బొగ్గులకుంట ఆటోస్టాండ్‌కు వెళ్ళేదారిలో)

సభాధ్యక్షులు: శ్రీ నోరెళ్ల మాల్యాద్రి
అడ్వకేట్ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా, మ్యూనిస్టీ.
ముఖ్య అతిథి ఆవిష్కర్త: శ్రీ వై.యస్.ఆర్.శర్మ
సంపాదకులు ఆంధ్రప్రభ దినపత్రిక
విశిష్ట అతిథి: శ్రీ అయాచితం శ్రీధర్
తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ పూర్వ అధ్యక్షులు.

–:గౌరవ అతిథులు:–
డాక్టర్ విజయలక్ష్మీ పండిట్ ప్రముఖ కవయిత్రి, విశ్వపత్రిక గజల్ ఫౌండేషన్ చెన్నై.
శ్రీ అబ్దుల్ రజా హుస్సేన్ ప్రముఖ జర్నలిస్టు రచయిత.
శ్రీ సామల రాజవర్ధన్ కవి పండితులు.
శ్రీ ముకుంద సుబ్రహ్మణ్యశర్మ ప్రముఖ గజల్ కవి
శ్రీ ఇరువింటి వెంకటేశ్వర శర్మ ప్రముఖ కవి, గజల్ సాహిత్య వేదిక అధ్యక్షులు.
శ్రీ తంగిరాల చక్రపాణి సుప్రసిద్ధ జర్నలిస్ట్, కవి, రచయిత.

కీ.శే. శ్రీమతి అండాళ్ళు గారికి..
"ఆరాధ్య" గజల్ గాన నీరాజనం
గాయకులు: శ్రీ దసిపిళ్ళ
బెత్సాహిక గాయనీగాయకులచే గజల్ గానం

ప్యూచర్ సిటీకి సాయం చేయండి .. మోడీని కోరిన రేవంత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: హైదరాబాద్ కు తలమానికంగా రూపు దిద్దుకుంటున్న ప్యూచర్ సిటీకి తగిన ఆర్థిక సాయం అందించాలని ప్రధాని మోడీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.. హస్తిన పర్యటనలో ఉన్న రేవంత్ నేడు మంత్రి శ్రీధర బాబుతో కలసి మోడీతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ ఎల్ బి సి టన్నెల్ ప్రమాద వివరాలను తెలియజేశారు. అలాగే అక్కడ జరుగుతున్న సహాయ కార్యక్రమాలను గురించి ప్రధానికి చెప్పారు..

ఇక రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల కు చట్టబద్ధత, కులగణన తో పాటు ఎస్సీ ఉపకులాల వర్గీకరణ బిల్లులపై చర్చించారు. సెకండ్ ఫేజ్‌లో భాగంగా మెట్రో రైల్ కారిడార్ ను నగర శివారు ప్రాంతాలకు విస్తరించేందుకు చేపడుతోన్న డీపీఆర్‌ను ప్రధానికి సీఎం వివరించారు. మూసీ పునరుజ్జీవం, ట్రిపుల్ ఆర్‌తో పాటు ప్యూచర్ సిటీకి కేంద్ర ప్రభుత్వం నుంచి సాయం చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ప్రారంభించబోయే వలు ప్రాజెక్టులకు సంబంధించి నిధులు, రాష్ట్ర విభజన చట్టం లోని వివిధ పెండింగ్ సమస్యలను చర్చించినట్లుగా సమాచారం.

ఇది ఇలా ఉంటే ఇప్పటికే మెట్రో రైలును శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ముచ్చర్లలోని ప్యూచర్ సిటీ వరకు విస్తరించేందుకు ఇప్పటికే పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు హెచ్ఎండీఏ , టీజీఐఐసీ , హెచ్ఎంఆర్ కలిసి సర్వే నిర్వహించారు. దాదాపు 22 కి.మీ మేర మెట్రో రైలు ట్రాక్ నిర్మాణం కానుంది. . దీనికి అనుమతులతో పాటు ఆర్థిక సాయం చేయాల్సిందిగా కోరారు రేవంత్ .

ఇక రేవంత్ వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) కార్యదర్శి శేషాద్రి, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) జితేందర్ లు ఉన్నారు.

మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి ..

–రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి
–సొంతూరులోని శివాలయంలో ప్రత్యేక పూజలు
–జాతరలో చిన్ననాటి దోస్తులతో కలిసి పర్యటన
–స్వీట్లు పంచుతూ సందడి చేసిన భట్టి

ఖమ్మం, ఫిబ్రవరి 26:రాష్ట్ర ప్రజలు సభిక్షంగా ఉండాలని, ప్రపంచంలో తెలుగు ప్రజలు ఎక్కడున్నా క్షేమంగా ఉండాలని ఆ శివపార్వతులను వేడుకున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భార్య నందినితో కలిసి నేటి ఉదయం స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మిపురంలోని పురాతన శివాలయంలో, మధిర నియోజకవర్గ కేంద్రంలోని శివాలయంలో పూజలు నిర్వహించారు.

శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఉప ముఖ్యమంత్రి పూజలు నిర్వహించారు. స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు. మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పండగ లాంటి వార్త చెప్పిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి పర్వదినాన తెలంగాణలో ఉపాధి కూలీలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం.

ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది.

కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది సర్కార్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధి కూలీలకు పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్థిక చేయూత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక సీజన్‌కు 6000 రూపాయలు చొప్పున కూలీలకు భరోసా కల్పిస్తోంది. డీబీటీ పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తోంది.

దైవ దర్శనానికి వెళ్తున్న మహిళ మృతి

వరంగల్, ఫిబ్రవరి 26: జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం జంగేడు గ్రామానికి చెందిన సమ్మెట సమ్మయ్య భార్య సమ్మెట భాగ్య (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని శ్రీ కాళేశ్వర ముక్తిశ్వర స్వామి దర్శించుకునేందుకు బుధవారం భార్య భర్తలు తమ ద్విచక్ర వాహనంపై వెళ్ళారు. ఈ క్రమంలో జాతీయ రహదారి 353సి మహాదేవపూర్ – కాళేశ్వరం జాతీయ రహదారి అటవీ ప్రాంతం లోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో భాగ్య మృతిచెందింది. మృతదే హన్ని మహాదేవపూర్ ఆస్పత్రికి తరలించారు.

'పరమపథం' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26: సమాజహితం కోరే సాహిత్యం రావాల్సిన అవసరముందని విశ్రాంత ఐఏఎస్ డా॥కే.వి.రమణాచారి అన్నారు. మంగళవారం రమణాచారి క్యాంపు కార్యాలయంలో సాహితీకిరణం సంస్థ ఆధ్వర్యంలో డా॥పులివర్తి కృష్ణమూర్తి రచించిన 'పరమపథం' పుస్తకావిష్కరణ సభ జరిగింది.

రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. కార్యక్రమంలో గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు, రఘువీర్‌ప్రతాప్, పొత్తూరి జయలక్ష్మి పాల్గొన్నారు.

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 27-2-2025

పంచారామం

స్నేహితుడే శత్రువైతే
సమస్యలెక్కువ
శత్రువే స్నేహితుడైతే
సంతోషాలెక్కువ.
మితిమీరిన మాటలు
వెగటు పుట్టిస్తాయి
ఆచితూచిన మాటలు
ఆసక్తిని పుట్టిస్తాయి
ఆడంబరంగా
ఆరంభించకు
మామూలుగా
ముగించకు
కళ్లు మూస్తే
కలలు
కళ్లు తెరిస్తే
వలలు
తెలుగై
వెలగనీ
అలుగై
సాగనీ



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

స్పర్థ

ఓ కరోజు
నాలుకతో దంతాలన్నాయి గదామరినేనో!
'నఖరాలు చెయ్యకు
మేం 32 మందిమి ఉన్నాము
నువ్వు ఒంటరి దానివి
మేం తలుచుకుంటే
నిన్ను ఒక్కసారిగా
నమిలి పారెయ్యగలం'.
నాలుక
ప్రజాస్వామ్యం అలవాటైన
సత్యకాలపు సత్తెమ్మ
పండ్లతో అదిలా అంది
'ఓ ముద్దొచ్చే ముత్యాల్లారా
మీ బుద్ధులు పాడయినట్టున్నాయి
గర్వం వద్దు
కాలక్రమంలో మీరు
ఒక్కొక్కటిగా రాలిపోతారు
దేహమున్నంత కాలం ఉంటాను
క్రౌర్యం అక్కరకురాదు
కలిసి పనిచేద్దాం
ఏమన్నా ప్రాబ్లమా!' అంది.
నాలుక
తియ్యటి మాటలకు
దంతాలు కొంత మెత్తబడ్డట్టున్నాయి.

-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

భారతావతారిక

(రామకృష్ణ చంద్రమౌళి కవితా సంపుటి 'చంద్రమౌళి భారతం' పుస్తకంపై -ఆచార్య టీ. గౌరీశంకర్ రాసిన ముందు మాట...)

మనుషులందరికీ ఆలోచించే శక్తి ఉంటుంది. కానీ ఆ ఆలోచనలను అందంగా వ్యక్తీకరించగలిగే శక్తి కొందరికి మాత్రమే ఉంటుంది. ఆ శక్తినే లోకంలో కవిత్వం అని వ్యవహరిస్తారు. అందమైన ఊహలకు అక్షరాల రెక్కలు వచ్చి మనోవీధులలో విహరిస్తూ, అవి కాగితాలపై పల్లవించి పరిమళిస్తే అది కవిత్వం. అందం, ఆనందం, మాత్రమే కవిత్వం కాదు. తీపి జ్ఞాపకాలు, చేదు నిజాలు, మరపురాని అనుభవాలు, మధురమైన అనుభూతులు, ఆవేదనలు, అనుబంధాలు మొదలైనవన్నీ ప్రతిభావంతుడైన కవికి కవితా వస్తువులే. ప్రకృతి సౌందర్యానికి పరవశించి రాసే కవిత్వానికి ఎంత విలువ ఉంటుందో అణగారిన జీవితాల ఆర్తిని గురించి రాసిన కవిత్వానికీ అంతే విలువ ఉంటుంది. మానవీయ సంబంధాలు, నైతిక విలువలు, సామాజిక సంక్షేమం, ప్రజా సమస్యలు, దేశప్రగతి ఇవన్నీ కవిత్వానికి ముడి సరుకులే.

ఏది ఏమైనా కవిత్వం మంచిని పెంచాలి, మనిషిని మంచిమార్గంలో నడిపించాలి. ఆలోచింపజేయాలి, ఆహ్లాదాన్ని కలిగించాలి. సమాజంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించాలి. మనుషుల నడుమ విద్వేషాలను తొలగించాలి. దేశాల నడుమ విధ్వంసాలను నివారించాలి. లోకకళ్యాణ కారం కావాలి. ఇవన్నీ కలగలిసిన కవిత్వమే కలకాలం నిలవగలుగుతుంది. కవిత్వానికి కేవలం ఊహాశాలీనత, భావుకత, భాషా సామర్థ్యం ఉంటే సరిపోదు. బలమైన కవిత్వాంశ, కవితా వస్తువు వుండాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్నందువల్లే కొన్నివేల సంవత్సరాల నాటి రామాయణ, భారత, భాగవతాలు నేటికీ నిత్యనూతనంగా, ప్రతిఒక్కరికీ అనుసరణీయంగా నిలిచి ఉన్నాయి.

వెయ్యేళ్ళ తెలుగు కవిత్వం వస్తువరంగా పెనుమార్పులు పొందినట్లే, రూపపరంగా కూడా ఎంతటి వైవిధ్యాన్ని సంతరించుకొంది. అది కావ్యం పద్యరూపంగా అవతరిస్తే, అనంత కాలంలో గేయరూపంగా కొనసాగింది. ఆధునిక కాలంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావంచేత వచన కవితగా ప్రాదుర్భవించింది. వచన కవితలో కూడా మినీ కవిత, నానీలు, సప్తపదులు, ప్రపంచపదులు అంటూ నేటికవులు అనేకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇవాళ వచన కవిత్వం బలంగా నిలదొక్కుకుంది. నేటితరం కవులు అధికశాతం వచన కవిత్వాన్ని రచిస్తున్నారు.

అటువంటి నేటితరం కవులలో శ్రీ రామకృష్ణ చంద్రమౌళి గారొకరు. నేటితరం అనటం కంటే 'నిన్నటి తరం' అనవచ్చునేమో! ఎందుచేతనంటే? ఆయన సుమారు యాభైఏళ్ళుగా రాస్తున్నారు. తన మనసు స్పందించినప్పుడు, భావావేశం పెల్లుబికినప్పుడు, రాయకుండా ఉండలేని పరిస్థితిలో మాత్రమే ఆయన కలానికి పని చెపుతారు. అంతేగానీ అయినదానికి, కానిదానికి ప్రచారం కోసం, ఆర్భాటంచేస్తూ అంతట నేనే కనిపించాలి అన్న ఆబతో ఆయన రాయరు. రాయడం ఒక సామాజిక బాధ్యతగా భావిస్తారు. తనురాసే ప్రతిమాట సమాజంపై ప్రభావాన్ని చూపాలనే ఒక సదాశయంతో మాత్రమే ఆయన రాస్తారు. అందుకే యాభై ఏళ్ళుగా రాస్తున్నా ఇంతవరకు రెండు సంపుటాలను మాత్రమే ప్రచురించగలిగారు. ఒకరకంగా నిశ్శబ్దకవి.

'చంద్రమౌళి భారతం' అన్న ఈ కవితాసంపుటి వీరి ప్రచురణలలో రెండవది. దీనిలోని కవితలన్నీ కవి స్వానుభవాలు, జీవితంలో తారసపడిన సంఘటనలు, మనసును కదిలించిన సన్నివేశాలు, హితోక్తులు. వీటిని కొన్ని అధ్యాయాలుగా వింగడిస్తే, అవి.. 'రసగుల్లాలు', 1971 నుండి నా సాహితీ ప్రస్థానం', 'మనసు పలికిన మాటలు' అని మూడు విధాలుగా కనిపిస్తాయి. వీటికి ముందు నాందీ ప్రస్థావనగా తనకు బాల్యం నుండీ అత్యంత సన్నిహితంగా ఉండి తన జీవన గమనానికి మార్గదర్శిగా ఉన్న 'పార్తసారథి' అనే ప్రాణ స్నేహితుని గురించి అనుభూతి చెంది రాసిన పెద్ద కవిత ఉంది. మనిషి జీవితంలో స్నేహానికి ఉండే విలువను తెలియజేస్తుంది ఈ కవిత. ఇక 'రసగుల్లాలు'లో అరవై నాలుగు కవితా ఖండికలు ఉన్నాయి. ఇవి నాలుగేసి పంక్తులతో కూడి 'ముత్యాల సరాల' మాత్రాగణ గేయ ఛందోరీతిలా అనిపిస్తాయి. '1971 నుండి నా సాహిత్య ప్రస్థానం'లో అరవై ఆరు వచన కవితలు ఉన్నాయి. చివరగా 'మనసు పలికిన మాటలు'లోనివి అభిప్రాయ మాలికలు, సందేశాత్మకాలు.

-రామకృష్ణ చంద్రమౌళి
9666656687

మిత్రుని గురించి రాసిన కవితలో..

"నా నిర్లక్ష్యాన్ని ప్రతిఘటించాడు
నీరసపడి చతికిలపడినప్పుడు
బతుకుపట్ల విరక్తి కలిగినప్పుడు
ఊరడింపుల బోధ చేశాడు"

జీవితంలో ఇటువంటి మిత్రుడు అష్టఐశ్వర్యాలకంటే గొప్ప.

'రసగుల్లాలు'లో,..

"ధూమపానం మానవద్దు.. దున్నపోతై
పుట్టవద్ద'ని వెండి తెరలు నొక్కిచెప్పు"

అన్న పంక్తులు గురజాడ వారి 'కన్యాశుల్కం'లో గిరీశం అన్న "ధూమపానం చేయనివాడు దున్నపోతై పుడతాడు" అన్న మాటల్ని గుర్తు చేస్తాయి. అదే విధంగా..

'మల్లెవంటి తెల్లబట్టలు
మంచువంటి చల్లమాటలు
మనిషిరూపం మార్చలేవు
కల్లమనసును కప్పలేవు"

అన్న పంక్తులు.. శ్రీశ్రీ

"నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధనొన్నటి ఆహుతిచ్చా"

అన్న గేయగతిని స్ఫురింపచేస్తుంది. దీనిలో మనిషి బాహ్యరూపం కాదు, అంతఃకరణం పరిశుద్ధంగా ఉండాలనే ప్రబోధం ఉంది. '1971 నుండి నా సాహితీ ప్రస్థానం'లో

"రక్తం త్రాగిన ముఖంతో
'వెళ్ళొస్తా'నంటూ
ముక్తసరిగా
రవి చెప్పేవేళ" పంక్తుల్లో

సాయం సంధ్యలో సూర్యుని అస్తమయాన్ని ఉపమించిన తీరు దుష్టసంహారం చేసిన దుర్గామాతను తలపిస్తుంది.

"కార్యసిద్ధికి కొంతమేరకు
ఉడుకు నెత్తురు అక్కరవునోయ్" అన్న వాక్యాలు మళ్ళీ శ్రీశ్రీని గుర్తు చేస్తాయి.

చివరగా 'మనసు పలికిన మాటలు'లో..

"కాలం మారుతుంది అంటాం మనం. కానీ మారేది కాలం కాదు. మనుషులు, వారి స్వభావాలు, అదే కాల మార్పుగా భావిస్తాం మనం" అన్నది అక్షరసత్యం. కాలం ఎలా ఉందో అలాగే ఉంటుంది. రాత్రి-పగలు, కాలాలు, ఋతువులు, శాఖా సంక్రమణం, మారేది మనిషి మాత్రమే.

శ్రీ రామకృష్ణ చంద్రమౌళిగారు దీనికి 'చంద్రమౌళి భారతం' అని పేరు పెట్టడం సముచితమే. 1971 నుంచి రాస్తూ వచ్చిన కవితలన్నీ 2023లో సంపుటిగా వెలుగులోకి తెస్తున్నారు. అయితే ఇందులోని కవితలు కొన్ని అక్కడక్కడ పత్రికలలో ఆచ్చయినవి. అప్పుడప్పుడు కవి సమ్మేళనాలలో చదివి వినిపించినవి. ఇప్పుడు వాటన్నింటిని గుదిగుచ్చి ఒక పుష్పగుచ్చంగా సమర్పిస్తున్నారు. దీనిని రసజ్ఞులు, కవితా పిపాసులు అందుకొని పరిమళాలను ఆఘ్రాణిస్తూ, రసాస్వాదన చేస్తూ కవిని అభినందించాలి.

శ్రీ రామకృష్ణ చంద్రమౌళిగారిని నేను మనస్ఫూర్తిగా ప్రశంసిస్తూ నా శుభాకాంక్షలు అందజేస్తున్నాను వీరి కలం నుండి మరిన్ని రచనలు వెలువడి సమాజాన్ని ప్రభావితం చేస్తూ, వీరి కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షిస్తున్నాను.

-ఆచార్య టి. గౌరీశంకర్
సెల్:9440969130

చెట్టునీడ

పుస్తక సమీక్షలు

"మన్నులో పుట్టి, మన్నులో పెరిగి
మన్నునే తిని, మన్నురాతలు రాసిన
మట్టి మనిషిని నేను ఒట్టి మనిషిని నేను" అని గర్వంగా చెప్పుకునే రచయిత్రి జాజులగౌరి '(మునింగల సుశీల నాగరాజు) సాహిత్యంలో ఒక మైలురాయి. చాలా తక్కువగా రాస్తారు. కాని వీరి కథలన్నీ పాఠకుని మీద చెరగని ముద్ర వేస్తాయి. 2004లో వీరి మొదటి కథా సంకలనం **"మన్నుబువ్వ"** వచ్చింది. తెలుగు సాహిత్యంలో అప్పటి దాకా రికార్డుకాని దళితుల జీవితాలకు చిత్రికపట్టారు. వంశంలోనే స్కూలుకు వెళ్ళిన మొదటి అమ్మాయి జాజులగౌరి అంటే నాటి సామాజిక వ్యవస్థ, దళితుల్ని ఎలా ఆదరించిందో తెలుసుకోవచ్చును. ఏనాటికైనా బాగా చదివి జీవితాన్ని గెలవాలన్న దృఢ నిశ్చయం రచయిత్రిని జర్నలిజం మరియు లా చదివేలా చేసింది. తెలుగు సాహిత్యంలో అప్పటి దాకా రికార్డుకాని దళితుల, సమాజంలోని అట్టడుగు జీవితాల్ని తనదైన ప్రత్యేక శైలి, శిల్పంతో వ్రాసిన ఘనత ఈ రచయిత్రికి దక్కుతుంది. సమాజంలో రాజీపడుతూనే పోరాటం సాగించి విజయం సాధించిందీ రచయిత్రి. 1969లో పుట్టిన ఈ రచయిత్రి 1980 నుంచే కవితలు రాయటం మొదలు పెట్టారు. 300కుపైగా అలాంటి కవితల్ని వ్రాసి వాటికి "ఊహాసాహిత్యం" అని పేరు కూడా పెట్టుకున్నారు. అంబేద్కర్ జీవిత చరిత్ర చదివి ప్రేరణ పొందారు. ఉత్తేజితులయ్యారు. ఊహాల్లోంచి బయటపడి దళిత జీవితాలను ప్రతిబింబించే కవితలు వ్రాయటం మొదలు పెట్టారు. 1996లో వచ్చిన 'ఉతికి పారేస్తా' కవిత గౌరికి మంచి పేరు తెచ్చిపెట్టింది. 60కి దగ్గర పడుతోన్న ఈ రచయిత్రి ఎందుకో ఇప్పుడు కవితలు వ్రాయటం లేదు. సామాజిక తత్త్వవేత్త శ్రీ బి.యస్. రాములుగారు మరియు వీరి ప్రచురణ సంస్థ "విశాల సాహిత్య అకాడమీ" వీరికి గొప్ప చేయతనిచ్చింది. రచయిత్రి మొట్టమొదటి కథా సంకలనం 'మన్నుబువ్వ' ప్రచురించి రచయిత్రిని వెలుగులోకి తెచ్చింది. లా పూర్తి చేసి హూకోర్టు అడ్వకేటుగా ప్రస్తుతం పనిచేస్తూ విశాలసాహితీ అకాడమీ మరియు మాదిగ దండోరా ఇచ్చిన చైతన్యంతో ఎదుగుతూ, తాను పడ్డ వేదన, ఎదురుపడ్డ జీవితం, సంస్కృతిని కథలుగా నవలలుగా వ్రాస్తున్నారు. ప్రస్తుత కథా సంకలనం "చెట్టు నీడ" వీరి రెండవ సంకలనంగా తోస్తున్నది. 23 కథలున్న చెట్టునీడ. బి.యస్.రాములుగారి మాటల్లో "ఈ కథలు సామాజిక చరిత్ర పరిణామాన్ని మానవ సంబంధాల పరిణామాన్ని చిత్రించాయి".

అందరూ స్వాగతించే వానపడితే, దళితుల జీవితాలు ఎలా అస్తవ్యస్తం అయితాయో బయటకు వెళ్ళటం తప్పని వాళ్ళ జీవితాలు ఎలా చిందరవందర అయి ఆందోళనకు గురి చేస్తాయో, సంకలనంలోని మొదటి కథ "వర్ష నృత్యం" వివరిస్తుంది. అభం శుభం ఎరుగని ఆరేడేళ్ళ పిల్లలు తమ స్థితిగతులను మరిచి ఎలా "ఎంజాయ్" చేస్తారో తెలుపు తుందీ కథ.

వీధి కొళాయిలు, అంతగా అభివృద్ధి చెందని రక్షితనీటి పథకాలు లేని రోజుల్లో బోరువెయ్యటం అపు రూపం. ఎక్కడో ఒకటీ ఆరా ఉండే ఆ రోజుల్లో 'రామక్క'. తన ఇంటికీ, పంటకు ఉపయోగపడాలని 'బోరు' వేయించుకుంది. బోరులో పడ్డ నీళ్ళ కొబ్బరి నీళ్ళ లెక్కతీయగున్నయి. ఊరి సర్పంచు వగైరా పెద్దలు మిగతా బోర్లన్నీ ఉప్పు నీళ్ళే.. అందుకని ఊరి జనాలని వాడుకోనిమ్మంటారు. మొదట్లో రామక్క ఒప్పుకోదు. 'ఊరు ఊరందరికి మంచినీళ్ళిస్తే మాకేం మిగులుతది" అంటూ విసుక్కున్నది రామక్క కోడలు లక్ష్మి. అయితే ఒంటరి జీవితాన తనను కదుపులో దాచుకున్న ఊరు, ఊరి జనం రామక్కకు గుర్తుకు వచ్చింది. మనసు పెద్దది చేసుకుని "పోయేటప్పుడు ఇవన్నీ కట్టుకు పోతామా! ఏంది? ఊరి జనాల దాహం తీర్చినమన్న ఆత్మతృప్తి దక్కింది చాలు" అంటూ పెద్ద మనసు చేసుకుంది రామక్క. ఇక ప్రతిదినం ఆ ఊరిల గంగమ్మ తల్లి నీళ్ళ జాతర చేసింద"ట! నలుగురి గురించి మంచి ఆలోచించే "రామక్క" కథ మంచి నీతిని, న్యాయాన్ని వివరిస్తుంది.

ప్రతులకు:
జాజుల గౌరి
8-4-373/15/ఎ,
శాస్త్రినగర్, ఎర్రగడ్డ,
హైదరాబాద్-500 018
సెల్: 8519923199

వంశంలోనే స్కూలుకు వెళ్ళిన మొదటి అమ్మాయి జాజులగౌరి అంటే నాటి సామాజిక వ్యవస్థ, దళితుల్ని ఎలా ఆదరించిందో తెలుసుకోవచ్చును.

ఆకు కూరలు పండించి కట్టలు కట్టి అమ్మే చంద్రమ్మ కుటుంబంలో చంద్రమ్మకు తొలిచూలు. బిడ్డను అపురూపంగా చూసుకోవాలని మనసు తహతహపడ్డా, విడిచి పొలంలో కూర ఆకులు త్రెంపి కట్టలు కట్టి గంపకెత్తటం తప్పనిసరి. చెట్టునీడన బిడ్డను ఉంచి కూర ఆకులు త్రెంపే పనిలో పడింది చంద్రమ్మ. పసిబిడ్డను చలిచీమలు ఈ గల్లెక్క ముసిరి మిఠీయిని తింటున్నట్లు కొరికిపెడతాయి. చివరాకరికి బిడ్డ దక్కదు. చంద్రమ్మపడ్డ గర్భశోకం, బిడ్డ చనిపోతే పాటించే ఆచారాలు, చంద్రమ్మ బిడ్డను ఎంత అపురూపం గా చూసుకున్న వైనం "సెలిమె"లో కళ్ళకు కట్టుతాయి. కథలో నాయకుడు శేఖర్ అవివాహితుడిగా మరణిస్తే జిల్లెడు కొమ్మతో శేఖర్ శవానికి పెళ్ళిచేసి అంత్యక్రియలు కావించటం అనే ఆచారం "కల చెదిరింది"లో తెలు సుకుంటాము. ఆర్థికంగా వెనకబడ్డ జీవితాల్లో ప్రేమ కూడా శాపమేనని విచలితం అవుతాము. రైతు మరణా లు వివరించే కథ 'చెట్టునీడ'. ఎర్రటి ఎండలో చెట్టునీడలా చల్లదనాన్ని రైతు సంఘాలు పంచుతాయని, అధైర్యపడవద్దని చెప్పే కథ ఇది. నిమ్నకులాల్లోనే జోగినులు ఎందుకు అవుతారు? అనే ప్రశ్న" అందరికీ నా సంసారమే కావాలె. (ఎందుకు?) నా పత్త కావాలె. కాని నేను మనిషినన్న సుద్ది ఎవరూ పట్టించుకోరు" అంటూ జోగులక్ష్మి ఆవేదనను, సమాజం నిమ్న కులస్థులను ఎలా తమస్వార్థానికి వాడుకుంటున్నది తెలుపుతుంది ఈ కథ. మనిషిని సాటి మనిషే ఎట్లా పీడించుకుతింటారో, ఈ కథ తెలుపుతుంది.

కథలన్నింటా రచయిత్రి తనదైన, తమ వర్గానికి చెందిన భాషతో వ్రాసి కథలకు సహజత్వం చేకూర్చారు. రచయిత్రి గెలిచి, సాధించిన జీవితాన్ని రచయిత్రి మాటల్లోనే, మాటలుగానే చదవటం బాగుంది. నేడు మనకు కనిపించే సమాజం రచయిత్రి బాల్యం అంత కఠినంగా దుర్భరంగా లేదు.

అయినా, ఆనాటి సాంఘీక స్థితిగతులను గ్రంథస్థం చేయటం అనే బాధ్యతను రచయిత్రి జాజుల గౌరి అతి ప్రతిభావంతంగా నిర్వహించారు.

రచయిత్రి మొదటి కథా సంకలనాన్ని 'నేటినిజం'లో సీరియల్ కథలుగా ప్రచురించటం సంపాదకులు శ్రీ బైస దేవదాసుగారి విచక్షణ, దళితుల జీవితాలను పరిచయం చేయాల్సిన అవసరం గుర్తించటం ముదావహం. అభినందనలు.

కథలన్నింటా రచయిత్రి తనదైన, తమ వర్గానికి చెందిన భాషతో వ్రాసి కథలకు సహజత్వం చేకూర్చారు.

- కూర చిదంబరం
సెల్: 8639338675

మార్పు?

అందరూ మన వాళ్లే
అనుకుంటాను నేను
కాని వాళ్లు మాత్రం
నువ్వు, నేను అంటూ
మాటల గునపంతో గుండెను
తవ్వుతూనే ఉంటారు.
ప్లాస్టిక్ నవ్వులతో ప్లాస్టరేసి...
పాలల్లో నీళ్లు కలిపినట్లు
పసి మనసులకు మసిని పులుముతారు.
ఉపన్యాసపు ఊయల మీద మాత్రం
అందరం ఒక్కటేనని
ఉర్రూతలూగుతూనే ఉంటారు.
శెలకల నీళ్లకాడ మాత్రం
గెట్లేసుకుంటూ గోల గోల చేస్తారు.
పావురానికి నలుపంటదు
కాకికి తెలుపంటదు
ఏ చిలుక పలికినా
ఎవరికి వినబడదు
వినబడినా స్వార్థపు చెవులకు
చిల్లులు.
అలాంటప్పుడు...
రెండు ఒక్కటెలా అవుతాయి ?
రెండే కలవనప్పుడు
అన్ని కలుస్తాయి...
అందరం ఒక్కటేనని అనుకోవడం
ముమ్మాటికీ తప్పే.
నిజానికి చేసే
పనుల రంగు మారుతుంది
మనస్తత్వాలు మారవు,
మారినట్లు నటిస్తారంతే.!

-బింగి శ్రీకాంత్,
7893613015

నేర్చుకోవాలి మరో భాష

ఆస్వాదించాలి అమ్మ భాషను
అమృతంగా.
ఆదరించాలి దానితో పాటు
అన్య భాషలను కూడా సమాంతరంగా.
ప్రపంచీకరణ నేపథ్యంలో
పారదర్శకంగా మారుతున్న సరిహద్దులు
దేశ విదేశీ పౌరుల సమ్మేళనంతో
కాదేదీ పరాయి భాష.
మరో భాష నేర్చుకుంటే
భవ్య జీవనానికది మహా భరోసా.
ఇతర భాషలపై సాధించిన పట్టు
జీవన క్రమంలో ఎదగడానికి
అవుతుందదొక అందమైన మెట్టు.
భాష భాషతో జ్ఞానానికి సాన
జీవన పర్యంతం కురిసే
మెరుపుల సోనా.
రాళ్లు ఎన్ని విసిరినా
రాల్చిన కాయలే
నిపుణతకు గీటు రాయి.
భాషలెన్ని నేర్చినా
సాధించిన ప్రజ్ఞయే
నిజమైన గుర్తింపు.
బహు భాషాజ్ఞానమే ఆది సూత్రం
విజ్ఞానిగా, సుజ్ఞానిగా, ప్రజ్ఞానిగా
మనిషిని మార్చడానికి.
భాష ఏదైనా
అక్షర యజ్ఞమే అంతిమంగా
ప్రతి మనిషికి శ్రీరామ రక్ష!

-ఆచార్య కదారు
వీరారెడ్డి
9392447007

వసుచరిత్రలో మరో ఆణిముత్యం

సీ.
మెరుగొప్పు నెరిగొప్పు నెరగప్పు తరిగప్పు
జలదమాలిక చొప్పు దెలుపలేదొ
బలువాలుగలనేలు తెలివాలు గనుడాలు
కలువపూదెరమేలు దెలుపలేదొ
నలువైన కళలీన గలలేనగవుసోన
కలశాబ్ధితెరమేన నిలుపలేదొ
కనకంపు ననసొంపు కడనుంపు రుచిపెంపు
పసిడి తీగలగుంపు మెసగలేదొ
తే.
ప్రాణనాథుఁలారా! నెయ్యంపుటలుకబూని
యేల యీబాల యీవేళ నీవిశాల
యవనికాభ్యంతరంబున కరిగిననగ
ననుగు నెచ్చెలి మరియు నెయ్యమున జేరి!

వసు చరిత్ర- తృతీయాశ్వాసము:69వ.పద్యం

సందర్భం: చెలికత్తెలు గిరికను పరిహాసమాడుట. ఆమె అలిగి తెరమాటుకు పోవుట. వసురాజు ఆమె అందాన్ని వర్ణిస్తూ ... చెప్పిన సందర్భం.

భావం :కవి ఆమె అందమైన కొప్పును (నెరిగొప్పు) వర్ణిస్తూ (తరిగప్పు జలదమాలిక-వర్షాకాలంలో ఉన్న నీల మేఘము)

నీల కాంతి గల మేఘము వలె

ఉన్న ఆమె కొప్పు ఒక నలుపు తెరవలే ఉండగా ఆమె తెరవెనుకకు పోవడం ఎందులకు?

అనేకమైన చేపలను గెలవగలిగిన (పలువాలుగలు -వాలుగలు- చేపలలో ఒకరకం) ఆమె నేత్రాలు దవళ కాంతితో కూడిన తెల్ల కలువ అందాలను మించినవి. మరి ఆమె(తెలి- అందమైన, వాలు- సొగసైన, కను-కనులు, డాలు- అందము) తెల్ల కలువ పువ్వుల తెర వెనుకకు ఎందుకు పోవాలి?

ఆమె లేనగవు సోన అనగా లేత నవ్వుల సోన నవ్వుతూ కళకళలా దుతూ ఉండగా చంద్రకళను ఉత్పాదించుచున్నది కనుక తెల్ల సముద్రపు తరంగాలు అనుతెర వెనుకకు ఎందుకు పోవలెను?

ఆమె మేను" కనకంపు నన సొంపు కడనుంపు రుచి పెంపు" కనకమనగా సంపంగి, బంగారము అని రెండు అర్థములు కలవు.

ఆమె మేను బంగారు తీగ వలె ప్రకాశిస్తున్న దని కవి భావన. బంగారు తీగలతో కూడిన తెర వెనుకకు ఎందుకు పోవలెను.

ఓ ప్రాణసకులారా! నెయ్యం పుటలుకబూని ఈ గిరిక తెరవెనుకకు ఎందుకు పోవలెను.

స్వల్ప వివరణ: ఆమె కొప్పు నల్లగా ఒక తెరవలే ఉన్నది ఆమెను కనిపించకుండా చేయుచున్నది. అది ఒక తెర.

ఆమె కనులు తెల్ల కలువలను మించిన సొగసు కలిగినవి. అనగా తెల్ల కలువల తెర మరొక తెర.

ఆమె లేత నవ్వు పాల నురగను పోలి ఉన్నది.

అది ఒక తెర.

ఆమె శరీరం బంగారు తీగెలను పోలియున్నది.

బంగారు తీగలుఒక తెర. పై నాలుగు తెరల చేత ఆమె కప్పబడుచుండగా ముగింపు:

రిక 'నెరిగొప్పు' జలద మాలికలవలెను, చెలి చూపులు, కలువ పువ్వుల తెరవలెను, లేనగువు, క్షీర సముద్ర తరంగ ములవలెను, మేనెతీవ (తీగెవం టిమేను) బంగారు తీగల వలెను ఉన్నవని భావము.

ఆకర గ్రంథము

'శేషాద్రి రమణ కవుల వసుచరిత్ర సటీకా'

ఆమె లేనగవు సోన అనగా లేత నవ్వుల సోన నవ్వుతూ కళకళలా దుతూ ఉండగా చంద్రకళను ఉత్పాదించుచున్నది కనుక తెల్ల సముద్రపు తరంగాలు అనుతెర వెనుకకు ఎందుకు పోవలెను? ఆమె మేను "కనకంపు నన సొంపు కడనుంపు రుచి పెంపు" కనకమనగా సంపంగి, బంగారము అని రెండు అర్థములు కలవు.

-కిలపర్తి దాలినాయుడు
7780589336

సునందామృతం

తుల్యాయ వ్యయ న్యాయము

తుల్యము అంటే సమానము. ఆయము అంటే ఆదాయము. వ్యయము అంటే ఖర్చు,వెచ్చము అనే అర్థాలు ఉన్నాయి.

ఆదాయమును చూసుకుని దానికి తగ్గట్టు ఖర్చు చేయాలనే అర్థంతో ఈ తుల్యాయ వ్యయ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.

ఉన్నంతలోనే సర్దుకోవాలి. శక్తికి మించి గొప్పల కోసం అప్పులు చేస్తే బొక్కబోర్లా పడక తప్పదు".అంటారు పెద్దలు.

దీనికి సంబంధించిన పద్యాన్ని చూద్దామా!

"ఉప్పు లేని కూర హీనంబు రుచులకు/ పప్పులేని తిండి ఫలము లేదు/యప్పులేని వాడె యధిక సంపన్నుడు/ విశ్వధాభిరామ! వినురవేమ!"

అంటే ఉప్పు లేని కూర రుచిగా ఉండదు అలాగే పప్పులేని భోజనము శరీరానికి అంతగా బలాన్ని ఇవ్వదు. కాబట్టి కూరకు రుచి రావాలంటే ఉప్పు, శరీరం ఆరోగ్యంగా, బలంగా ఉండాలంటే పప్పు ఆహారంలో ఉండేలా చూసు కోవాలి. కానీ అప్పు మాత్రం ఉండకుండా చూసుకోవాలి.అందుకే అప్పు లేనివాడు అధిక సంపన్నుడని వేమన అన్నారు.అప్పు లేక పోతే చీకూ చింతా లేకుండా హాయిగా ఆనందంగా ఉండొచ్చు .

మరి అప్పు చేస్తే ఆ వ్యక్తికే కాకుండా కుటుంబం మొత్తానికి ముప్పు వస్తుంది.

అప్పు తీర్చలేక ఫలానా రైతు లేదా వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడనే వార్తలు తరచూ పత్రికల్లో చదువుతున్నప్పుడు ఎంతో బాధ కలుగుతుంది కదా!..నేడు సమాజం లో చాలా మంది 'తగ్గేదేలే' అన్నట్లు ఏ చిన్న ఫంక్షన్ అయినా వేలు,లక్షలు నీళ్ళ ప్రాయంగా ఖర్చు పెడుతున్నారు. డబ్బు ఉన్న వాళ్ళైతే ఫరవా లేదు కానీ అరకొర సంపాదన ఉన్న వాళ్ళు కూడా గొప్పలకు పోయి శక్తికి మించి ఖర్చు చేస్తున్నారు,ఆ తర్వాత అది తీర్చుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు.

దీనినే ఆరుద్ర తన కూనలమ్మ పదాలలో..."తీర్చినట్టి బకాయి తెచ్చిపెట్టును హాయి/ అప్పు మెడలో రాయి ఓ కూనలమ్మా!" అన్నారు.

కాబట్టి మనకున్న ఆదాయాన్ని బట్టే వ్యయం చేయడం నేర్చుకుంటే ఈ 'తుల్యాయ వ్యయ న్యాయానికి' సరైన న్యాయం చేసిన వాళ్ళం అవుతాం.

-పురిమళ్ల సునంద
9441815722

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి
సాహిత్యవరం
రేడియమ్ రచనలు
నమ్మలేని నిజాలు
జీవ గణితం
గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం



సభాధ్యక్షులు
డా.నాయిమోజు బాలాచారి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
అతిథి&ఆవిష్కర్త (నమ్మలేని నిజాలు)
బైసా దేవదాసు, ఎడిటర్, నేటినిజం
అతిథి&ఆవిష్కర్త (జీవగణితం)
డా.అమ్మంగి వేణుగోపాల్, ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథులు
డా.చెన్నకేశవరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త
డా.ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త
నాగవరం బలరాం, కవి
వేదిక: తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్-500 004
తేది: 01.03.2025 (శనివారం), సమయం : సా॥ 4.00 గంటలకు
సాహితీప్రియులందరికీ సాదర ఆహ్వానం..
RSVP : 040 - 29703142

ఆచార్య మసన చెన్నప్ప 70వ జన్మదినోత్సవం సందర్భంగా...

ఆచార్య మసన చెన్నప్ప జీవితం - సాహిత్యం



అలుపెరగని సాహిత్య పరిశోధకుడు మసన చెన్నప్పగారు. "అమ్మ మనసే కమ్మనైనది, తెలుగు భాష చక్కనైనది" అని అమెరికా గడ్డపై ఆశువుగా భారతీయతను, మాతృభాషను గురించి గొప్పగా వర్ణించిన ఆచార్యులు చెన్నప్పగారు. దేశభక్తి, జాతీయత భావం, తెలుగు భాషపై ఆయనకు ఎనలేని ప్రేమ. ఆ ప్రేమ పదవి విరమణ తర్వాత మరింత ఎక్కువైంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రస్తుతం విశ్రాంత ఆచార్యులుగా ఉన్న చెన్నప్పగారు ఏనాడూ అక్షరానికి, ఆధ్యాత్మిక ప్రసంగాలకు విశ్రాంతిని ఇవ్వలేదు. పదవీ విరమణ వయసు వల్లనే కానీ సాహిత్యానికి కాదు అని ఆయన అంటుంటారు. విద్యార్థిగా ఉన్న కాలంలోనే భాగవతం, కాళిదాసు మేఘసందేశం లాంటివి అలవోకగా నేర్చుకొన్న సరస్వతీ పుత్రుడు.





బాల్యం:

మహబూబ్ నగర్ జిల్లాలోని కల్వకుర్తి తాలూకా మాడ్గుల మండలంలోని కొలుకులపల్లి గ్రామంలో మసన బుచ్చయ్య, మసన రామలక్ష్మమ్మ పుణ్యదం పతులకు 1955 ఫిబ్రవరి 8న జన్మించారు. పద్మశాలి (చేనేత) కుటుంబంలో జన్మించిన సాహితీ పితాంబరుడు చెన్నప్పగారు. ఆయనకు ఇద్దరు అన్నలు, నల్గురు అక్కలు. చెన్నప్ప ఏడవ సంతానం. నిండైన కుటుంబంలో జన్మించి అమ్మానాన్నల ఆప్యాయత, సోదరుల ఆత్మీయతల మధ్య పెరిగిన చెన్నప్పగారు నేటికీ అవే కుటుంబ విలువలను, ఐక్యత భావనను తన విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తారు. నేటి సమాజంలో కుటుంబ విలువలను గురించి తన ప్రసంగాలలో నిరంతరం చెబుతూనే ఉంటారు.



విద్యాభ్యాసం:

చెన్నప్పగారు తన ఆరవ ఏట పాఠశాలకు వెళ్లారు. అమ్మ ఒడిని వదిలి బడి బాటను పట్టి కట్టె పలక, చిరుచాప, బలపాలతో స్నేహాన్ని పెంచుకున్నారు. అదే నేడు ఆచార్యులుగా, ఆధ్యాత్మిక ప్రసంగకర్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, బహుగ్రంథకర్తగా సాహితీవనంలో నిలబడేలా చేసింది.

బడిలో అ ఆ లు పెట్టించిన మొదటి గురువు అబ్దుల్లా సార్.., లెక్కలు నేర్పిన రెండో గురువు సాల్మన్ సార్.. వీరిద్దరి నేతృత్వంలో ఐదవ తరగతి వరకు ఊళ్లోనే విద్యాభ్యాసం కొనసాగించి, 6వ తరగతి నల్గొండ జిల్లాలోని చింతపల్లి హైస్కూల్‌లో కొనసాగింది. ప్రతివారం చెన్నప్పగారు తన ఊరికి వెళ్ళేవారు. చెన్నప్పగారి అమ్మగారు 2 మైళ్ళు నడిచి బస్‌స్టాండ్‌కు వెళ్ళి కొడుకుని బస్సెక్కించేవారు. తండ్రి చెన్నప్ప స్వయంపాకానికి సామాగ్రిని సిద్ధం చేసి ఇచ్చేవారు. తాను ఇంతగా ఎదగడానికి వారిద్దరి ప్రేమనే కారణం అని చెబుతుంటారు. పదవ తరగతి పాస్ కాకముందే 'ఆంధ్రసారస్వత పరిషత్తు ఆధ్వర్యంలోని ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. తను తెలుగు భాషోపాధ్యాయుడిగా నిలబడాలనే గట్టి ఆకాంక్ష ఈ పరీక్షల ద్వారా నెరవేరి 1971లో హైదరాబాద్ ప్రాచ్యకళా శాలలో చేరారు. అక్కడ మొదటి తరగతి నుండే మహామహోపాధ్యాయుల ప్రభావం చెన్నప్పగారిపై పడింది. కె.కె.రంగనాథాచార్యులు, దివాకర్ల వేంకటవధానిగారు, పెరవ లింగయ్యశాస్త్రి గారు, పదాయిత కృష్ణమూర్తి శాస్త్రిగారు, సుందరాచార్యులు గార్ల బోధనలో చెన్నప్పగారు సాహిత్యాన్ని క్షుణ్ణంగా నేర్చుకోగలిగారు. ఇది ఒక ఎత్తైతే రవ్వా శ్రీహరిగారి వ్యాకరణ క్లాసులు మరొక ఎత్తు. వారి జీవితాన్ని సాహితీ లోకంలోకి అడుగుపెట్టేలా చేసింది. అక్కడ చదువుతున్నప్పుడు ప్రఖ్యాత ఆచార్యులు గుండేరావు హర్కోర్ సాన్నిహిత్యమవడం చెన్నప్పగారికి ఒక వరమైనది. వారి వద్ద అనేక సాహితీ అంశాలను నేర్చుకున్నారు. ఆయన వద్దకు వచ్చే గొప్ప గొప్ప ఆచార్యుల ప్రభావం చెన్నప్పగారిపై పడింది. దాంతో ఆయన అలవోకగా పద్యాలను రాయడం అలవర్చుకున్నారు. అదే స్ఫూర్తితో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగులో 1980లో అడుగుపెట్టారు. నిరంతరం సాహిత్యంపై మక్కువ పెంపొందడం అది స్నాతకోత్తర తరగతిలో గురజాడ అప్పారావుగారి గోల్డ్? మెడల్? అందుకునేలా చేశాయి.

ఎం.ఏ మొదటి సంవత్సరం చదువుతున్నపుడే **"మల్లి పదాలు"** రాయడం ప్రారంభించారు. ఇది సినారె దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంలోనే తనకు పరిశోధన చేయాలనే కోరిక కల్గింది. **"వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ సూచిక"** అనే అంశంపై ఎం.ఫిల్ చేశారు. ఆ తర్వాత **"ప్రాచీన కావ్యాలు - జీవన చిత్రణ"** అనే అంశంపై పి.హెచ్‌డి చేశారు.

ఉద్యోగ జీవితం:

చెన్నప్పగారు తన మొదటి ఉద్యోగ జీవితాన్ని "ప్రగతి మహావిద్యాలయ"లో అధ్యాపకునిగా ఆరంభించారు. 1989లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఇది చాలా ఆనందదాయకమైన విషయం. తాను చదువుకున్న చోటనే ఆచార్యుడిగా అడుగుపెట్టడం. ఇది వారి నిరంతర పరిశోధన ఫలితమే. సహ ఆచార్యులుగా చేరిన నాటి నుండి ఎందరో విద్యార్థుల జీవితాల్లో సాహితీ కాంక్షను, పరిశోధన ఆవశ్యకతను పెంపొందించారు. 30 మంది విద్యార్థులు చెన్నప్పగారి పర్యవేక్షణలో పి.హెచ్.డి.లను పూర్తి చేశారు. విద్యార్థులలో జాతీయతా భావాలను పెంపొందిస్తూ తెలుగు భాషపై మక్కువ కలిగేలా పాఠ్యాంశాలను బోధించడం చెన్నప్పగారికి వెన్నతో పెట్టిన విద్య. 1995లో గోపదేవ్ శాస్త్రిగారి పరిచయం చెన్నప్పగారిలో కొత్త కోణాన్ని ఆవిష్కరింపచేసింది. చిన్ననాటి నుండి వారి అన్నలు, బావల వద్ద నేర్చుకున్న భారత, భాగవతాలను, అందులోని సారాన్ని మరింత లోతుగా పరిశీలన చేసి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసేలా మార్చివేసింది. దీనికి బీజం గుండేరావుగారు.

రచనలు:

చెన్నప్పగారు నిరంతర సాహిత్య పిపాసకుడు. అందరు కాలంతో పోటీ పడమంటారు. కానీ వీరు తన వయసుతో పోటీపడి సాహిత్యంలోని అనేక ప్రక్రియలలో రచనలు చేస్తున్నారు. కాబట్టి 70 ఏండ్లలో 60 రచనలు చేయడం సామాన్యమైన విషయం కాదు. మల్లి పదాలతో మొదలైన రచన వ్యాసాంగం ఇంకా కొనసాగుతూనే ఉంది. వీరి రాసిన **'నేత్రోదయం'** 'ఐరైసర్'గా ఆంగ్లంలోకి అనువదింపబడి తెలుగువారి ఖ్యాతి ఖండాలు దాటేలా చేసింది.

వీరి రచనల్లో ప్రముఖమైనవి: మల్లి పదాలు (కవిత్వం) 1980, వేటూరి ప్రభాకర శాస్త్రి వాఙ్మయ సూచిక (పరిశోధన) 1985, ప్రాచీన కావ్యాలు - గ్రామీణ జీవన చిత్రణ (పరిశోధన) 1990, 4. నేత్రోదయం (కవిత్వం) 1991, సమాలోచనం (సాహిత్య వ్యాసాలు) 1995, బృహద్గీత (బృహదారణ్యకోపనిషత్తుకు ముత్యాలసరాల రూపం) 1997, బ్రహ్మచర్యం (వ్యక్తిత్వవికాస గ్రంథం) 1999, అమృత స్వరాలు (కవిత్వం) 1999, ప్రకృతి పురుష వివేకం (సాంఖ్యదర్శనానికి ముత్యాల సరాల రూపం) 1999, అగ్ని స్వరాలు (కవిత్వం) 2000, సారస్వత లోచనం (సాహిత్య వ్యాసాలు) 2001, ఈశావాస్యం (ఈశావాస్యోపనిషత్తుకు ముత్యాలసరాల రూపం) 2001, వీరసావర్కర్ (నాటిక) 2002, చెన్నప్ప నానీలు (కవిత్వం) 2005, చెన్నప్ప పీఠికలు (విమర్శ) 2005, అక్షర కేతనం (సాహిత్య వ్యాసాలు) 2008, నయాగరా (గేయ రూపం, ఖండాంతర ఖండకావ్యం) 2010, అమెరికా! ఓ అమెరికా! (కవిత్వం) 2010, ఆ నందుక (కవిత్వం) 2010, సమదర్శనం ('ఈనాడు' దినపత్రికలో అంతర్యామి వ్యాసాలు) 2012, సుందరకాండ (రామాయణ సుందరకాండకు వచనరూపం) 2012, సడిలేని అడుగులు (రవీంద్రుని 'గీతాంజలి'కి లఘుకవితారూపం) 2013, తెలంగాణో దయం (పద్యకవితా సంపుటి) 2013, శుకోపనిశత్తు (పద్యరూపం, ఖండాంతర ఖండ కావ్యం) 2013, ఉద్గీథం (ఛాందోగ్యోపనిషత్తుకు ముత్యాలసరాల రూపం) 2013, సాహిత్యంలో తత్త్వ దర్శనం (సాహిత్య వ్యాసాలు) 2014, మోక్షసాధనలో దశోప నిషత్తులు (ప్ర.భా.) (ఆధ్యాత్మిక వ్యాసాలు) 2015, ప్రమీలా త్రిశతి (స్మృతి కావ్యం) 2016, చింతన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో (ఆధ్యాత్మిక వ్యాసాలు) 2019, పద్యమంజరి (ప్రవేశ పాఠ్యగ్రంథం) 2019, వ్యాకరణం-ఛందస్సు - అలంకారాలు (విశారద పాఠ్యగ్రంథం) 2019, ఆచార్య చెన్నప్ప అమెరికా ముచ్చట్లు (యాత్రా చరిత్ర) 2019, కాంటెంప్లేషన్ ('చింతన'కు ఆంగ్లానువాదం) 2020, శ్రీరామకథ - గేయం (సంపూర్ణ రామాయణం) 2021 మాతృగీత (శతకం) 2021, వేదమాత (శతకం) 2021, దరిసెనం (శతకం) 2021, కోకిల (పద్యకృతి కవిత్వం) 2021, 'భారత కోకిల' సరోజినీ నాయుడు (జీవిత చరిత్ర) 2021, హృదయకమలం 'చింతన-2' (ఆధ్యాత్మిక వ్యాసాలు) 2022, మోక్షసాధనలో దశోపనిషత్తులు (ద్వి.భా.) ఆధ్యాత్మిక వ్యాసాలు 2022, శ్రీరమణేశ్వర శతకం 2022 మాండూక్యోపనిషత్తు (వచనం) 2022, ఐతరేయోపనిషత్తు (వచనం) 2022, తైత్తిరీయోప నిషత్తు (వచనం) 2022, స్వాధ్యాయ సూక్తిసుధ (వేసూక్తులకు పద్యరూపం) 2023, వేదాలు - వేదాంగాలు 2023, ఉపనిషత్తులు - దర్శనాలు 2023, శ్రీ రామలింగేశ్వర శతకం 2023, శ్రేష్ఠారామం (వచన కవిత్వం) 2024, నా చూపు దేశం వైపు (కవిత్వం) 2024, దర్శన యోగధామం (కవిత్వం) 2024, చెన్నరాయ శతకం 2024.











అవార్డులు

గురజాడ అప్పారావు గోల్డ్ మెడల్ ఎం.ఏ తెలుగు మొదటి ర్యాంక్, ఓ.యూ. 1980; బెస్ట్ రైటర్ అవార్డ్ 'సూర్యశక్తి' సంస్థ, 2000; ఉగాది కవితా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 2004; తడకమళ్ల సాహితీ పురస్కారం జాతీయ సాహిత్య పరిషత్, సిద్ధిపేట, 2005; ఉగాది సాహితీ పురస్కారం-జ్యోత్స్నా కళాపీఠం, హైదరాబాద్, 2007; తిరుమల సాహితీ పురస్కారం తేజ ఆర్ట్ క్రియేషన్స్, నల్గొండ, 2008; వానమామలై జగన్నాథాచార్యుల అవార్డ్ సారస్వత జ్యోతిమిత్ర మండలి, కరీంనగర్, 2009; వానమామలై వరదాచార్య మెమోరియల్ అవార్డ్, భారతి సాహిత్య సమితి, కోరుట్ల, 2010; ద్వావం శెట్టి వేంకటేశ్వర సాహితీ పురస్కారం, ముంబై, 2011; కాళోజీ స్మారక పురస్కారం, తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం, జగిత్యాల, 2011; ఎన్..వి.ఆర్ విద్యాపురస్కారం ఎస్.వి.ఆర్. ఫౌండేషన్, హైదరాబాద్, 2013; ద్వాదశి లక్ష్మీప్రసన్న స్మారక పురస్కారం, రాగరాగిణి సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్, 2013; కీర్తి పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2013; 'ఆర్షకవి' పురస్కారం,తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, హైదరాబాద్, 2014; జాతీయ కవి పురస్కారం, ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం, 2014; బెస్ట్ టీచం అవార్డ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ , 5-9-2014; ట్రూ ఇండియన్ నేషనల్ అవార్డ్, విశ్వజన కళామండలి, హైదరాబాద్, 2014; కళా సుబ్బారావు స్మారక పురస్కారం, త్యాగరాయ గానసభ హైదరాబాద్, 2014; రాష్ట్రస్థాయి ఎం.వి.ఎస్.ఆర్. సాహితీ పురస్కారం, త్యాగరాయ గానసభ, హైదరాబాద్, 2014; తెలంగాణ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారం, తేజ ఆర్ట్ క్రియేషన్స్, 2016; నీలా జంగయ్య సాహితీ అవార్డ్, వాసవీ ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్, 2016; విశిష్ట కవి పురస్కారం-2016, ఆంధ్ర అసోసియేషన్, పూణె, 2016; స్వర్గీయ వెంకట్రావు పంతులు ధార్మిక సాహిత్య పురస్కారం, జాతీయ సాహిత్య పరిషత్, శంకర్‌పల్లి, 2018, ఉత్తమ రచయిత పురస్కారం, తెలంగాణ ప్రభుత్వం (రంగారెడ్డి జిల్లా నుంచి) 2018, శ్రీరామ నవమి జాతీయ ప్రతిభా పురస్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ భీమునిపట్నం, విశాఖపట్టణం, 2018; అన్నా స్మారక పురస్కారం, అన్నా ఫౌండేషన్, హైదరాబాద్, 2019, జీవన సాఫల్య పురస్కారం, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, 2019, ఎదిరె చెన్నకేశవులు జీవన సాఫల్య పురస్కారం, తెలుగు కవితా వైభవం, హైదరాబాద్, 2019, పద్మరత్న లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, హైదరాబాద్, 2019, మహాకవి దాశరథి సాహితీ పురస్కారం, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, హైదరాబాద్, 2019, అమ్మ యాది జీవన సాఫల్య పురస్కారం, బ్రాహ్మణపల్లి, నల్లగొండ, 2019; గాటా ఉగాది సాహిత్య పురస్కారం, గ్రేటర్ అట్లాంటా తెలుగు అసోసియేషన్, అమెరికా, 2021, అమృతలత జీవన సాఫల్య పురస్కారం, శ్రీవారి అపురూప కళ్యాణ మండపం, ఇందూరు, 2023; ముళ్లపూడి జాతీయ సాహిత్య పురస్కారం-2021, 'సాహితీ' సమితి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా, 2023.

వీరి ఉద్యోగ జీవితంతో పాటు కుటుంబ జీవితం కూడా ఉన్నతమైనది. వీరి సతీమణి గారు ఎల్లప్పుడు చెన్నప్పగారి అభ్యున్నతికి తోడ్పడేది. నిరంతరం పరిశోధననే ధ్యేయంగా వివిధ ప్రాంతాలకు చెన్నప్పగారు వెళ్తూంటే వారి పిల్లల చదువు, కుటుంబ వ్యవహారాలను చక్కగా చూసుకునేది.





'తాను తన అర్ధాంగి కాదు పూర్ణాంగి అంటూ భార్య యొక్క గొప్పతనాన్ని గురించి చెన్నప్పగారు చాలా సందర్భాల్లో చెబుతుంటారు.

అందుకే ఆమె వియోగం తర్వాత తన జ్ఞాపకాలను గురించి కావ్యాన్ని రాశారు. ఇది చాలు చెన్నప్పగారికి తన భార్యపై ఉన్న ప్రేమ గురించి తెల్పడానికి.టీవీ కార్యక్రమాలలో, యూట్యూబ్ ఛానెల్ ద్వారా తాను ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్నారు. ఇవేగాక నేటి సమాజంలో ఉన్న మూఢనమ్మకాల పైన కూడా అనేక ప్రసంగాలు చేస్తున్నారు. దాదాపు 120 ఎపిసోడ్లుగా ఉపనిషత్తుల పైన ప్రసంగాలు చేశారు. విజయక్రాంతి పత్రికలో సంవత్సరం పాటు ప్రతి శనివారం 'చెన్నప్పగారి జీవితానుభవాలు' ప్రచురితం అయ్యాయి. ఆధ్యాత్మిక వేదికలపైన 'ఉపనిషత్ సప్తాహాలు' తొమ్మిదికి పైగా చేశారు.

ముగింపు:

ఏడు పదుల వయసులో యువకుడిలా పరిశోధనలు, పలు పత్రికల్లో వ్యాసాలు, వివిధ ప్రసార మాధ్యమాలలో ప్రసంగాలు, జాతీయ, అంతర్జాతీయ వేదికల పైన భారతీయతను గురించి గొప్పగా చెబుతున్న సాహితీ కిరణం చెన్నప్పగారు. అద్వితీయమైన విషయపరిజ్ఞానం, లోతైన పరిశోధనానుభూతి, ముక్కుసూటితనం, చతురమైన సంభాషణ, మృదుస్వభావం, కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన కలిగిన 'ధీశాలి' చెన్నప్పగారు. వయసుతో పనిలేని పరిశోధన, భావితరాలకు తనవల్ల ఎంత సమాచారం దొరుకుతుందనే భావనే ఆయన ప్రధాన ధ్యేయం. అందువలన తాను నేర్చుకుంటూ, నేర్పుతూ, ఎల్లప్పుడు తన నూతన ఆలోచనలను చేస్తున్న 'దక్షిణామూర్తి' (గురువే) చెన్నప్పగారు. వీరి సాహిత్య ప్రస్థానం ఇలానే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ గురువుగారికి 70వ పుట్టినరోజు శుభాకాంక్షలు.

-ఆచార్య కరిమిండ్ల లావణ్య
డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్
తెలంగాణ విశ్వవిద్యాలయం
నిజామాబాద్
మొబైల్: 98484 10244







యుగధర్మం



– బి.ఎస్.రాములు
సెల్: 8331966987

కొన్ని సామాన్య లక్షణాలను గమనించి అది యుగధర్మం అని వర్గీక రిస్తుంటారు. విప్లవాల యుగం మనది. విప్లవిస్తే జయం మనది అని కవులు తమ కాలం యుగధర్మం, విప్లవం అని పేర్కొన్నారు. చేగువేరా మరొక మాట అన్నాడు. విప్లవం పరిస్థితులు ఎప్పుడూ ఉంటాయి. మనం ప్రజలను కదిలించి విప్లవింపజేయడమే మన కర్తవ్యం అన్నాడు. ఇది చైతన్యవంతమైన నాయకత్వం యొక్క ప్రాధాన్యతను తెలుపుతుంది. ఎవరో ఒకరు ముందుగా ఒక సమస్యను లేవనెత్తినప్పుడు అది చర్చనీయాంశం అవుతుంది. వారి శక్తి సామర్థ్యాలను అనుసరించి, ప్రజల ఆసక్తి, అవసరాలు అనుసరించి ఉద్యమాలుగా రూపొందుతుంటాయి. విస్తరిస్తుంటాయి. అలా అనేకచోట్ల ఒకేరకమైన ఉద్యమాలు సాగినప్పుడు దాన్ని యుగధర్మం అంటుంటారు.

1980లో ఐక్యరాజ్య సమితి ఆ దశాబ్దాన్ని మహిళా దశాబ్దంగా ప్రకటించింది. అంతదాకా పేరుకుపోయిన అనేక సమస్యలు స్త్రీల పరంగా, స్త్రీలకు అనుకూలంగా చర్చకు ముందుకు వచ్చాయి. స్త్రీల సమానత్వం, స్త్రీల పట్ల వివక్ష, కుటుంబంలో స్త్రీ పాత్ర, ఉత్పత్తి, సేవా రంగాల్లో స్త్రీల పాత్ర, స్థితిగతులు, లైంగిక వివక్ష, లైంగిక స్వేచ్ఛ, అనుత్పాదక శ్రమశక్తి, పిల్లల పెంపకం, చట్టాలు, చట్టాల్లో రావాల్సిన మార్పులు. సంస్కృతిలో మతాచారాల్లో కొనసాగుతున్న పురుషాధిపత్య, పితృస్వామిక భావజాలం, రాజ్యాంగ పరంగానే కొనసాగుతున్న పురుషాధిపత్య సంస్కృతి, విలువలు, వివక్ష, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో మహిళల ప్రాతినిధ్యం మొదలైన అంశాలన్నీ ఆ దశాబ్దంలో ముందుకు వచ్చాయి. ఇలా అంతదాకా ఉన్న సమస్యలే ప్రత్యేక శ్రద్ధతో అధ్యయనం చేయడం జరిగింది.

మహిళా దశాబ్దం అని ప్రకటించడం విప్లవోద్యమాలను నిర్వీర్యం చేయడం కోసం అని కొంతకాలం భావించారు. సోషలిస్టు దేశాల్లో, యూరప్, అమెరికా దేశాల్లో అన్ని రంగాల్లో ఎదిగి వచ్చిన మహిళలు, ఎదుగుతున్న మహిళలు ముందుకు తెచ్చిన డిమాండ్లలో భాగంగానే మహిళా దశాబ్దం ప్రకటించడం జరిగింది అనేది కూడా వాస్తవం.

వందేళ్ళుగా ఫెమినిజం అనేక కోణాల్లో అభివృద్ధి

ఓటు హక్కు లేని దేశాల్లో మహిళలకు ఓటు హక్కు గురించి, ఆస్థి హక్కు లేని దేశాల్లో మహిళలకు ఆస్థి హక్కు గురించి, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో ప్రాతినిధ్య రిజర్వేషన్ల గురించి అనేక ఉద్యమాలు కొనసాగాయి.

చెందింది. ఆయా తాత్విక భావనలను అనుసరించి, ఉద్యమాలను అనుసరించి ఫెమినిజం కూడా అనేక పాయలుగా విస్తరించింది. సామాజిక వర్గాలవారీగా, జాతుల వారీగా, దేశాల వారీగా అభివృద్ధి అందుకున్న దేశాల వారీగా అభివృద్ధిలో వెనుకబడి పోయిన దేశాల వారీగా పీడిత కులాల వారీగా, మధ్య తరగతి, సంపన్న వర్గాల వారీగా ఫెమినిజం మహావృక్షం శాఖోపశాఖలుగా ఎదుగుతూ వచ్చింది. అన్నింటిలో ఉన్న సామాన్య లక్షణాలే యుగధర్మం అంటారు. అలా మహిళా దశాబ్దం ఒక యుగధర్మాన్ని ముందుకు తెచ్చింది.

ఇట్లా శతాబ్దాలుగా పేరుకుపోయిన, ఆమోదించబడిన, పితృస్వామిక అణచివేతకు గురైన, వివక్షను కొనసాగించిన అంశాలు పరిష్కారం కోసం ముందుకు తేబడ్డాయి. అనేక సిద్ధాంతాలు, తాత్విక చర్చలు, నిర్దిష్ట జీవితం, సంస్కృతి, విలువలు మానవ సంబంధాల నుండి వీటన్నిటిని వెలికితీయడం వేగం పుంజుకుంది. అవి ఆయా ఉద్యమాలుగా విస్తరించాయి. ఆయా దేశాల్లో స్థానిక సంస్కృతి, స్థితిగతులను అనుసరించి ప్రత్యేకంగా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, కళా రంగాలతో పాటు రాజకీయ ఉద్యమాల్లో కూడా ప్రసరించాయి. వ్యక్తీకరించబడ్డాయి. ఓటు హక్కు లేని దేశాల్లో మహిళలకు ఓటు హక్కు గురించి, ఆస్థి హక్కు లేని దేశాల్లో మహిళలకు ఆస్థి హక్కు గురించి, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో ప్రాతినిధ్య రిజర్వేషన్ల గురించి అనేక ఉద్యమాలు కొనసాగాయి.

ఇలా మహిళా దశాబ్దం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ఏదో ఒక స్థాయిలో అనేకమైన మలుపులను, దశలను ముందుకు తెచ్చింది. అది ఒక యుగధర్మంగా ప్రపంచంలోని సగం జనాభా యొక్క ప్రధానమైన సమస్యగా, డిమాండ్‌గా, పరిష్కారంగా ముందుకు వచ్చింది. ఇలా చేగువేరా చెప్పిన సిద్ధాంతం, విప్లవ పరిస్థితులు ఎప్పుడూ ఉంటాయి. ప్రజలను కదిలించి విప్లవం సమాయత్తం చేయడమే మన కర్తవ్యం అనే మాట ఎంత గొప్ప మాటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ఐక్యరాజ్య సమితి 1980ని మహిళా దశాబ్దంగా ఎందుకు ప్రకటించింది? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మహిళలు విద్యా, ఉద్యోగాలు సంపాదించుకొని సామాజిక చైతన్యంతో ముందుకు సాగినప్పుడు వారి చైతన్యం వికసించి స్త్రీల సమానత్వాన్ని ఫెమినిజం రూపంలో చర్చకు తెచ్చారు. జీన్‌పాల్ సాత్రే సహచరి సైమన్ దిబోవర్ 1950లలో ''సెకండ్ సెక్స్'' అనే గ్రంథాన్ని వెలువరించింది. అది అనేక ప్రశ్నలను లేవనెత్తింది. అంతకుముందు సోవియట్ రష్యాలో విప్లవోద్యమంలో భాగంగా రోజా లగ్జెంబర్గ్, అలెగ్జాండ్రా కొలంటాయ్ వంటి వాళ్ళు స్త్రీల సమానత్వాన్ని గురించి విప్లవోద్యమంలో భాగంగా ఉంటూనే చర్చించారు. యూరప్ దేశాల్లో విప్లవోద్యమానికి సమాంతరంగా, విప్లవోద్యమా నికి వెలుపల స్త్రీల సమానత్వం గురించి చర్చలు ముందుకు తెచ్చారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు కుటుంబ వ్యవస్థే స్త్రీల అణచివేతకు, అసమానతలకు ప్రధాన కారణమని ప్రకటించారు. పురుషాధిపత్య, పితృస్వామిక వ్యవస్థ రూపుదిద్దుకుని స్త్రీలను రెండో శ్రేణి పౌరులుగా అణచివేయడం మొదలైందని చరిత్రను విశ్లేషించారు. ఈ పురుషాధిపత్య, పితృస్వామిక కుటుంబ వ్యవస్థకు ముందు మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని, ఆ కాలంలో తల్లే కుటుంబ పెద్దగా కొనసాగిందని వివరించారు.

ఇలా మాతృస్వామిక వ్యవస్థలో కొనసాగిన సంస్కృతి, మానవ సంబంధాలు, ధర్మాలు, ఆచారాలు మొదలైనవాటన్నిటిని మాతృస్వామిక వ్యవస్థ, యుగధర్మం అని పేర్కొంటారు. తల్లే వేట, ఆహార సేకరణ దశ నుంచి సంతానోత్పత్తి జరుగుతున్న క్రమాన్ని గమనించింది. అట్లే ప్రకృతిలో వృక్ష, పక్షి జంతుజాలం పుట్టి పెరుగుతున్న క్రమాన్ని పరిశీలించింది. అలా విత్తనాలు వేసి పంట పండించడం అనే వ్యవసాయాన్ని కనుక్కున్నది తల్లే. వ్యవసాయాన్ని కనుక్కున్న తర్వాత మహిళకు ప్రసవం, పిల్లల పెంపకం వంటి అదనపు ప్రకృతి కర్తవ్యాలు ఉండడం వల్ల విశ్రాంతి అవసరమైంది. అది అదనుగా తీసుకొని పురుషుడు తన ఆధిపత్యాన్ని నెలకొల్పాడు.

అట్లా వ్యవసాయాన్ని కనుక్కొన్న తర్వాత పితృస్వామిక పురుషాధిపత్య వ్యవస్థ రూపుదిద్దుకొని స్థిరపడుతూ వచ్చింది. ఈ దశలో, ఈ వ్యవస్థలో కొనసాగే సంస్కృతిని, విలువలను, రాజకీయాలను, కళలను, సాహిత్యాన్ని, మానవ సంబంధాలను వివక్ష, అణచివేతలను పితృస్వామిక యుగధర్మంలో భాగంగా కొనసాగిన వాటిని ప్రశ్నించి స్త్రీల సమానత్వం కోసం పనిచేయడం కోసం అనేక సిద్ధాంతాలు, ఉద్యమాలు ఫెమినిజం రూపంలో ముందుకు వచ్చాయి. ప్రభుత్వాలు కదిలి స్త్రీల సమానత్వానికి అనుకూలంగా కొన్ని చట్టాలు, ప్రత్యేక చర్యలు చేపట్టాయి. అలా బాలికలకు విద్య, బాలికల సంరక్షణ, ప్రసూతికి జీతంతో కూడిన సెలవులు మొదలైనవి ప్రత్యేక శ్రద్ధతో అమలులోకి వచ్చాయి.

ఇవన్నీ ఎంతో అవసరమైనవి. 1918లో సోవియట్ రష్యాలో విప్లవం విజయవంతమై సోవియట్ యూనియన్ ఏర్పడినప్పుడు మిగతా దేశాలు మహిళా సమస్యను సోవియట్ యూనియన్‌లో వలె గుర్తించలేదు. 1949లో చైనాలో విప్లవం విజయవంతమై సోషలిస్టు సమాజం రూపుదిద్దుకునే క్రమంలో అప్పుడైనా మహిళా సమానత్వం గురించి మిగతా దేశాలు ఆలోచించలేదు. ఐక్యరాజ్యసమితి ఏర్పడిన తర్వాతనైనా దాని భావజాలం ఆవశ్యకత అన్ని దేశాలు గుర్తించిన తర్వాత 1950-60లలో ఈ మహిళా దశాబ్దాన్ని ఎందుకు ప్రకటించలేదు?. 1980 మహిళా దశాబ్దాన్ని ప్రకటించడానికి కారణాలు ఏమిటో ప్రత్యేకంగా వెలికి తీయాల్సిన అవసరం ఉంది.

మార్క్సిస్టులు, లెనినిస్టులు విప్లవాలు చేసే సామాజిక వర్గాలు, రష్యా, చైనా సోషలిస్టు క్యాంపు స్ఫూర్తితో అనేక దేశాల్లో విప్లవోద్యమాలు విస్తరించాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అనేక దేశాలు వలస ప్రాంతాలు స్వతంత్ర దేశాలుగా రూపుదిద్దుకున్నాయి. ఆఫ్రికా దేశాల్లో థియాలజీ సిద్ధాంతంలో భాగంగా ధార్మిక ప్రచారంలో భాగంగా కూడా విప్లవోద్యమాలు ముందుకు వచ్చాయి.

1965 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలు, రాజ్యాలు, రాజకీయాలు, పారిశ్రామిక ఉత్పత్తి రంగాలు, అమెరికా, యూరప్ దేశాల సైన్స్, టెక్నాలజీ అభివృద్ధి, వాణిజ్యం అభివృద్ధి, నిరుద్యోగం పెరిగి పెరిగి అనేక సంక్షోభాలకు దారి తీశాయి. ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉద్యమాల బాట పట్టారు. ఫ్రాన్స్‌లో విద్యార్థులు ఉద్యమాలు చేసి డీగాల్ ప్రభుత్వాన్ని దించివేశారు. అదే సమయంలో క్యూబాలో ఫెడరల్ క్యాస్ట్రో, చేగువేరా నాయకత్వంలో ఉద్యమాలు కొనసాగాయి.

ఆఫ్రికా దేశాల్లో విస్తరిస్తున్న విప్లవోద్యమాలు మరొకవైపు. యూరప్, అమెరికా దేశాల ఆధిపత్యాన్ని ఆయుధ సంపత్తితో ప్రోత్సహిస్తున్న యుద్ధాలను, దాడులను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు మొదలయ్యాయి. మరోవైపు సోవియట్ యూనియన్, పీపుల్స్ చైనా ప్రభుత్వాలు ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల్లో విప్లవోద్యమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తూ సాహిత్యాన్ని, సిద్ధాంతాలను అందించాయి. ఆయుధాలను కూడా సరఫరా చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా వలసాధిపత్య దేశాలకు వ్యతిరేకంగా, రాజరికాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య ఉద్యమాలు, సోషలిస్టు ఉద్యమాలు విజృంభించాయి. క్యూబాలో ఫెడరల్ క్యాస్ట్రో, చేగువేరా ఉద్యమాలు జరుగుతున్న కాలంలోనే భారతదేశంలో నెమ్మదితనం రాజీ తనం పనికిరాదని 1965లో బెంగాల్ సిపిఎం పార్టీకి చెందిన చారుమజుందార్, సరోజ్ దత్తా తదితరుల నాయకత్వంలో నక్సల్‌బరి ఉద్యమం సంతాల్ గిరిజనుల తిరుగుబాటు మొదలైంది. అదే వరుసలో శ్రీకాకుళం ఉద్యమం సాగింది.

నక్సలైట్ ఉద్యమం కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, మార్క్సిస్టు, లెనినిస్టు, మావో థాట్ అనే సిద్ధాంత భూమికతో ముందుకు సాగింది. దాన్ని జ్యోతిబసు నాయకత్వంలో సిపిఎం ప్రభుత్వం క్రూరంగా అణచివేసి వేలాదిమందిని హత్య చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో శ్రీకాకుళం ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచారు. ఆ తర్వాత ఆనాటి సీనియర్ నాయకులు చనిపోయినవాళ్ళు చనిపోగా, మిగిలినవాళ్ళు ఎక్కడికక్కడ ప్రపంచ దేశాలలో వలెనే ఆయా రాష్ట్రాల్లో ఉద్యమాలు ప్రారంభించారు.

అట్లా బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల్లో ఎక్కడికక్కడ ఉద్యమాలు మొదలయ్యాయి. అలాగే పొరుగున ఉన్న నేపాల్‌లో కూడా ఉద్యమాలు మొదలయ్యాయి. ఇలా 1960 దశాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్రికా, ఆసియా, యూరప్, దక్షిణ అమెరికా దేశాల్లో అనేక ఉద్యమాలు ప్రజ్వరిల్లాయి. స్వాతంత్ర్యం పొందాయి. ఆయా దేశాల్లో తమదైన రాజ్యాంగాలను రూపొందించుకున్నారు.

అదే సమయంలో అమెరికాలో రవాణా సౌకర్యాలు విస్తరించి, కార్ల పరిశ్రమ బాగా వేగం పుంజుకొని పెట్రోల్ ఉత్పత్తుల అవశ్యకత పెరిగి, సంక్షోభం మొదలైంది. అరబ్ దేశాలు తమకున్న వనరులను స్వతంగా ధరను నిర్ణయించి అమ్ముకోవాలని ఒక్కటయ్యారు.

ఇలా అమెరికా దేశంలో కూడా సంక్షోభం మొదలైంది. ఆయుధాలు ఉత్పత్తి చేసే యూరప్, అమెరికా దేశాలు రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్థానికంగా, అంతర్యుద్ధాలను ఏదో ఒక వైపున ఉంటూ ప్రోత్సహించాయి. అలా రెండువైపులా ఆయుధాలను అందించి, ఆయా దేశాల్లో సంక్షోభాలను సృష్టించాయి. ఆయుధాలు అమ్ముకున్నాయి. ఆ సంక్షోభాలు యుద్ధాలతో ఆయా దేశాలు పూర్తిగా వెనుకబడిపోయాయి. ప్రజల అసంతృప్తి, అశాంతి, కరువు మరింత విస్తరించింది. ఇట్లా ఒకవైపు ఆయిల్ సంక్షోభం, ఆయుధాల ఎగుమతి, దిగుమతులు, వలసాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాలు, చైనా, రష్యా మద్దతుతో సాగుతున్న ఉద్యమాలు 1960 దశాబ్దాన్ని కుదిపివేశాయి.

అవి 1970 దశాబ్దానికి కూడా విస్తరించాయి. అప్పుడు యుద్ధోన్మాదులైన సామ్రాజ్య దేశాలు, వర్గాలు, పారిశ్రామిక వర్గాలు అనేక చర్చలు చేశాయి. సోషలిస్టు విప్లవాలను, నూతన ప్రజాస్వామిక విప్లవాలను దారి మళ్లించాలని, మలుపు తిప్పాలని భావించాయి. అదే సమయంలో ఆయా దేశాల్లో ఎదిగిన మహిళలు, స్త్రీల సమానత్వం కోసం ఉద్యమాలు ప్రారంభించారు. ఈ రెంటికీ పరిష్కారంగా ఐక్యరాజ్యసమితి 1980ని మహిళా దశాబ్దంగా ప్రకటించడం జరిగింది. ఇందులో అమెరికా యొక్క సిఐఏ పాత్ర ఎంత ఉందో తెలియదు.

అందువల్ల విప్లవ నాయకులు, విప్లవ సిద్ధాంతాలు ఫెమినిజాన్ని అస్తిత్వ వాదాలను విప్లవానికి వ్యతిరేకంగా ముందుకు తేబడిన సిద్ధాంతాలు అని భావించాయి. విమర్శించాయి. నిజానికి జరిగింది కూడా అదే. విప్లవోద్యమాల్లో కూడా మహిళలు తమ సమాన హక్కుల గురించి చర్చించడం ప్రారంభించారు. విప్లవోద్యమాలన్నీ పురుషాధిపత్య, పితృస్వామిక వ్యవస్థ సృష్టించిన కుటుంబ వ్యవస్థ ఆధిపత్యంలో ఉన్నవారికి అనుకూలంగా కొనసాగుతున్నది అని ప్రపంచ వ్యాప్తంగా ముందుకు తెచ్చారు. నాయకత్వ నిర్మాణంలోనే పితృస్వామిక, పురుషాధిపత్య ప్రాతిపదిక కొనసాగుతున్నది అని విశ్లేషించి నిర్ధారించారు. అలా విప్లవోద్యమంలో కలిసి పనిచేయాల్సిన సామాజిక వర్గాలు అంతర్గత చర్చలకు, అంతర్గత సంక్షోభాలకు లోనయ్యారు. విప్లవోద్యమం ముందుకు సాగే క్రమంలో ఫెమినిజం చర్చలు పెద్ద ఆటంకంగా పరిగణించాయని, విప్లవ పురుషాధిపత్య నాయకత్వం భావించింది. అయినా పట్టించుకోక తప్పలేదు.

విప్లవం విజయవంతమైన తర్వాత సోవియట్

మార్క్స్, ఎంగెల్స్‌లు కుటుంబ వ్యవస్థే స్త్రీల అణచివేతకు, అసమానతలకు ప్రధాన కారణమని ప్రకటించారు. పురుషాధిపత్య, పిత్రుస్వామిక వ్యవస్థ రూపుదిద్దుకుని స్త్రీలను రెండో శ్రేణి పౌరులుగా అణచివేయడం మొదలైందని చరిత్రను విశ్లేషించారు.

యూనియన్‌లో, పీపుల్స్ చైనాలో జరిగినట్టుగా అన్ని చర్యలు తీసుకోవచ్చు. విప్లవం విజయవంతమైన తర్వాత స్త్రీ, పురుషుల సమానత్వం కోసం అన్ని రకాలుగా కృషి చేయవచ్చు అని విప్లవోద్యమ నాయకత్వం ప్రచారం చేసింది. మహిళలు, మహిళావాదాలు ఆ వాదాన్ని వ్యతిరేకించాయి. ఇప్పుడు ఈ క్షణంలో అన్ని రంగాల్లో పరిష్కారం కావాలి. సమర్థం రావాలి. విప్లవోద్యమాల్లో కూడా పరిష్కారం కావాలి. రావాలి. అందుకు అనువైన పోరాట రూపాలను రూపొందించుకోవాలి. మహిళల ప్రాతినిధ్యం పెంచాలి. అందుకు అనువైన నూతన పోరాట రూపాలను రూపొందించుకోవాలి అని ప్రపంచ వ్యాప్తంగా సిద్ధాంత చర్చలు జరిగాయి. ఆఫ్రికా దేశమైన బోట్స్‌వానాలో జరిగిన మహిళా ఉద్యమాల గురించి హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తెలుగు అనువాదాలు ప్రచురించింది.

ఆ పుస్తకాలను, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాల్లో మహిళల పాత్రను మహిళా ఉద్యమకారులతో పాటు, విప్లవ నాయకత్వం కూడా అధ్యయనం చేయడం

కేవలం కుటుంబానికి పరిమితమై, కుటుంబ సంబంధాలకు పరిమితమై చిత్రించే కథలు, నవలలు ఏదో ఒక కులానికి చెందినవి అయి ఉంటాయి. అది మొత్తం సమాజాన్ని చిత్రించినట్టు కాదు.

ప్రారంభించింది. అలా క్రమక్రమంగా 1980 నుండి జాతీయ సదస్సులు నిర్వహించి అనేక అంశాలను చర్చకు తెచ్చారు. కలిసి వచ్చేవారిని కలుపుకు పోయారు. మహిళలు ఉద్యమాల్లో కలిసి రావడానికి వాటన్నిటిలోని సామాన్య అంశాలను స్వీకరించారు. అయినప్పటికీ మహిళలు మహిళావాదంతో ఈ సమాజ విముక్తి కోసం సాగే సాయుధ పోరాటాల్లో పెద్ద ఎత్తున చేరాలని భావించలేదు. వర్తమాన జీవితాన్ని గెలుచుకోవాలి అని భావించారు. అలా మహిళావాదంలో ఉన్నత విద్యావంతులైన మధ్య తరగతి మహిళావాదం విప్లవోద్యమాల భావజాలంపై చర్చలు ముందుకు తెచ్చింది.

మహిళా వాదాలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయి. అందువల్ల వాటికి సిద్ధాంత భూమిక చాలా విస్తారమైనది. వాటిని వ్యతిరేకించడం, అడ్డుకోవడం, నిలువరించడం, మార్క్సిస్టు, లెనినిస్టు, మావో ఆలోచనా విధానం అనే సామాజిక ఉద్యమకారులకు సాధ్యం కాలేదు. కనుక కలుపుకోవాల్సిన మేరకు కలుపుకుందామనేసరికి మహిళావాద ఉద్యమాల నుండి విప్లవకారిణులుగా రిక్రూట్‌మెంట్ పెద్దగా పెరగలేదు. మహారాష్ట్రకు చెందిన అనురాధాగాంధీ వంటివాళ్ళు కొందరు విప్లవోద్యమంలో కలిసి వచ్చారు.

ప్రపంచ వ్యాప్తంగా మహిళావాదాలు, మహిళా దశాబ్దం మూడు దశల్లో విజయాలు సాధించింది. ఒకటి ఆయా దేశాల్లో మహిళలకు అనుకూలంగా చట్టాలు, తమ ప్రాతినిధ్యం అనేక సంస్కరణలు చేపట్టడం. రెండు మహిళలు అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఎదుగుతూ రావడం. విద్యా, ఉద్యోగ రంగాల్లో, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రాతినిధ్యం కోసం రిజర్వేషన్లు, ప్రత్యేక అవకాశాలు విస్తరించడం. మూడు విప్లవోద్యమాల్లో మహిళలు అంతర్గత చర్చలు చేయడం. ఇలా రేపటి సోషలిస్టు విప్లవ ప్రభుత్వంలో రావాల్సిన మార్పుల కోసం ఎదురు చూడకుండా ఇప్పుడే ఈ వర్తమానంలోనే ఆ మార్పులు జరగాలి. ఆ సమానత్వం సాధించాలి. సంస్కృతి, విలువలు మారాలి అనే చైతన్యం మహిళా వాదాలు ముందుకు తెచ్చాయి. అలా శాంతియుత పరివర్తనతో మహిళావాదాలు ప్రపంచ వ్యాప్తంగా గత నాలుగు దశాబ్దాల్లో అనేక విజయాలు సాధించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మహిళా దశాబ్దం ప్రకటించకముందు ప్రపంచం వేరు. మహిళా దశాబ్దం ప్రకటించిన తర్వాత ప్రపంచ పరిణామాలు వేరు.

ఇలా వేల యేళ్ళ తర్వాత మానవ సంపదలో సగభాగమైన మహిలలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన గౌరవం, సమాన ఓటు హక్కు అన్ని రంగాల్లో సమానత్వం, ప్రాతినిధ్యం అనేవి ముందుకు వచ్చాయి. నూతన సంస్కృతి, విలువలు, మహిళా సమస్య కుటుంబ వ్యవస్థతో ముడిపడి ఉన్నది. అందువల్ల కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య, ప్రేమ పెళ్లి, లైంగిక సంబంధాలు, మానవ సంబంధాల మధ్య ఉన్న వివక్షను, ఆధిపత్యాన్ని, అణచివేతను అణువణువునా కొనసాగుతున్న అంశాలను నిర్దిష్టంగా వెలికి తెచ్చారని నిరూపించారు. నిరూపిస్తున్నారు. పురుషులు మారాలని డిమాండ్ చేస్తున్నారు. మారకపోతే అవసరమైనప్పుడు కుటుంబం నుంచి విడిపోయి సింగిల్ పేరెంట్‌గా కుటుంబ వ్యవస్థను ఏర్పర్చుకుంటున్నారు. ఈ క్రమం సోవియట్ రష్యా విప్లవానంతరం రష్యాలో వేగం పుంజుకుంది. అదే సమయంలో యూరప్, అమెరికాలో కూడా వేగం పుంజుకుంది. అనగా మొదటి ప్రపంచ యుద్ధం తెచ్చిన అనేక పరిణామాల్లో కుటుంబం, కుటుంబ వ్యవస్థ ప్రజాస్వామికం కావడం మొదలైంది అని అర్థం.

కోట్లాది మంది యువకులు మొదటి ప్రపంచ యుద్ధంలో, రెండవ ప్రపంచ యుద్ధంలో మరణించారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో మార్పులు వచ్చాయి. ఇదొక సమస్య. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో ఉత్పత్తి రంగాల్లో స్త్రీల శ్రమశక్తి అవసరమైంది. అనివార్యమైంది. వారి ఆవశ్యకత పెరిగింది. అలా స్త్రీలు సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా ఒక ప్రాధాన్యతలోకి వచ్చారు. అందువల్లే సోషలిస్టు వ్యవస్థలో, సోవియట్ యూనియన్‌లో ఎలాగైతే కుటుంబ వ్యవస్థ నుండి సింగిల్ పేరెంట్ వ్యవస్థ రూపుదిద్దుకున్నదో అదే స్థాయిలో యూరప్‌లో కూడా రూపుదిద్దుకోవడం జరిగింది.

రెండో ప్రపంచ యుద్ధం, భారత్, చైనా దేశాలు స్వతంత్ర దేశాలుగా ఎదగడం, అనేక దేశాలు స్వతంత్ర్యం పొందిన క్రమంలో కూడా తిరిగి అలాంటి మహా కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. ఆసియా దేశాల్లో సంస్కృతి, యూరప్ దేశాల సంస్కృతికి భిన్నంగా ఉంటుంది. ఆసియా దేశాల్లో ఎంతో కొంత మాతృస్వామిక వ్యవస్థ ఛాయలు, సంస్కృతి తల్లిపట్ల గౌరవం, మహిళల పట్ల గౌరవం అనేవి కొనసాగుతూ వస్తున్నది. యూరప్‌లో అరబ్ దేశాల్లో పురుషాధిపత్య కుటుంబ వ్యవస్థే బలంగా శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చింది. యుద్ధ ప్రభువులు సైనిక రిక్రూట్‌మెంట్ చేసుకుంటూ రావడం వల్ల పురుషాధిపత్యం అట్లా కూడా పెరుగుతూ వచ్చింది.

ఇలా శతాబ్దాల సామాజిక, చారిత్రక పరిణామంలో కుటుంబ వ్యవస్థ ప్రజాస్వామిక కుటుంబ వ్యవస్థగా మారే ప్రయత్నం జరుగుతున్నది. కుటుంబ సభ్యుల భావాలకు, గౌరవం ఇవ్వడం జరుగుతున్నది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ శతాబ్దాలుగా కొనసాగింది. వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, కులవృత్తులవల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. పారిశ్రామిక రంగాల విస్తరణతో, ఉమ్మడి కుటుంబ వ్యవస్థతో, వ్యక్తి కుటుంబంగా మారుతూ వచ్చింది. ఆధునిక విద్య, ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ సృష్టించే ప్రత్యేక నైపుణ్యాల వల్ల అదంతా ప్రత్యేక విడి కుటుంబాలుగా మారుతూ రావడం జరిగింది. మహిళలు అన్ని రంగాల్లో సాధికారికత కోరుకుంటూ, సాధించుకుంటూ రావడం వల్ల ప్రేమ, పెళ్లి, కుటుంబ వ్యవస్థలో బ్రేకులు పెరిగాయి. స్వయంగా, స్వంతంగా, ఒంటరిగా జీవించే రాజ్యాంగ రక్షణ, సామాజిక రక్షణ, సాంస్కృతిక, సాహిత్య భావజాల రక్షణ పెరుగుతూ వచ్చింది. అలా సోవియట్ యూనియన్‌తో పాటు యూరప్‌లో 1930 నాటికే మహిళా ఆధారిత సింగిల్ పేరెంట్ కుటుంబం కొనసాగుతూ వస్తున్నది. తండ్రితో సంబంధం లేకుండానే తల్లి తరపున 20 శాతానికి పైగా కుటుంబాలు ఏర్పడుతూ వచ్చాయి. అది కొన్ని దేశాల్లో 30 శాతం దాకా పెరిగింది.

ఈ ఆధునిక అభివృద్ధి, ఈ ఆధునిక పారిశ్రామిక రంగాన్ని, ఈ ఆధునిక విద్య, ఈ ఆధునిక సంస్కృతి ఇలాగే కొనసాగుతున్నంత కాలం అన్ని దేశాల్లో ఇదే క్రమం వెనుకా ముందు విస్తరిస్తుంది. ఈ దశలో ప్రపంచంలో విప్లవోద్యమాలు కొనసాగుతున్నాయి.

చైనా, రష్యాలో, క్యూబా తదితర దేశాల్లో 1960-70 దాకా జరిగిన విప్లవోద్యమాల కాలం కాదు ఇది. ఆ కాలం మారింది. సగం జనాభా అయిన మహిళలు అభివృద్ధిలో, అధికారంలో, విద్యలో, రాజకీయాల్లో సమాన వాటా కోరుకుంటున్నారు. ఆ వైపుగా శాంతియుతంగా, చట్టబద్ధంగా సాధించాలని కోరుకుంటున్నారు. గతంలో పితృస్వామిక పురుషాధిపత్య కుటుంబ వ్యవస్థలో పురుషులు విప్లవోద్యమంలోకి కదలబారారు. అతడు కుటుంబాన్ని వదిలేసి విప్లవంలో చేరితే ఆ బరువు బాధ్యతలన్నిటిని అతని తల్లిదండ్రులు, అతని భార్య లేదా అతని పిల్లలు అనివార్యంగా స్వీకరించారు. అలా విప్లవోద్యమంలో మగవారి రిక్రూట్‌మెంట్ జరగడం సాధ్యమైంది.

మేము విప్లవోద్యమాల యుగధర్మానికి చెందినవాళ్ళం. విప్లవోద్యమాల యుగధర్మం రెండు ప్రపంచ యుద్ధాలనంతరం ఏర్పడిన ప్రపంచ వ్యాప్త పరిణామాల్లో ఆవిర్భవించిన యుగధర్మం. సోవియట్ యూనియన్, చైనా, తూర్పు దేశాల సోషలిస్టు సమాజాల ఆవిర్భావానంతరం ఏర్పడిన నూతన పరిస్థితుల పరిణామంలో ఆవిర్భవించిన యుగధర్మం ఇది.

ఈ యుగధర్మాన్ని కొనసాగిస్తూ విప్లవాలు చేశాము. ఇంకా అనేక దేశాల్లో చేస్తున్నారు అని ఒక విషయం గమనించడం అవసరం. మహిళా దశాబ్దం తర్వాత ఆ పరిస్థితులు విప్లవ యుగధర్మం నుండి మహిళావాద యుగధర్మంలోకి మలుపు తిరిగాయి. ఇది మహిళా విప్లవం కావచ్చు. పురుషాధిపత్య, పితృస్వామిక భావజాల ప్రకారం విప్లవ వ్యతిరేక కౌంటర్ రెవెల్యూషన్ కావచ్చు. ఏదైనప్పటికీ సగం జనాభాకి సంబంధించిన సమస్య ఇది. అందువల్ల మహిళా యుగ ధర్మంలో భాగంగా విప్లవోద్యమాల యుగధర్మం కొనసాగాల్సిన దశ ఇది.

పితృస్వామిక, పురుషాధిపత్య వ్యవస్థలో భాగంగా ఉమ్మడి కుటుంబం ఏర్పడింది. గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకున్నది. వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థ కుదురు నుండి కొనసాగుతున్నాయి. స్త్రీల పట్ల వివక్ష కూడా అప్పుడే ప్రారంభమైంది. అనగా వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ, మహిళా వివక్ష అనేవి ఏక కాలంలో కుటంబ వ్యవస్థ కుదురులో రూపుదిద్దుకొని క

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

అజేయుడవే.

మనసుకు గాయమైంది
ఓదారుపు లేపనాలెన్ని పూసిన
కనిపించని మచ్చతో
మానలేకుంటుంది.
యాదికొచ్చినప్పుడల్ల
మన్నించలేనంతటి
కర్కశపు మాటలు.
సున్నితపు హృదయాన్నికి
గుచ్చుకున్నప్పుడల్ల
బాధ ఉప్పొంగి కన్నీటి బొట్లు
నేలను తడుపుతుంటవి
అలిసిన ఈ గుండెలకు
విశ్రాంతి ఇవ్వకున్న.
వారసత్వం పేరిట
రెక్కలను విరిచి
ఊపిరి గొట్టాలను
నులిపెయ్యకుంటే మేలు
బరువు మొయ్యకున్న
బాధ్యత నిర్వర్తించకున్న.
విలువలను మర్చి.
లౌకిక సమాజంపై.
మత ఉగ్రవాదపు
రుధిరం చిమ్మకుంటే మేలు
బానిసత్వపై ప్రతిఘటించి.
అమరుల నెత్తుట మరకలతడి వెచ్చగ
పారుతుంటే విధ్వంసపుకుట్రలకు.
ఆజ్యపోస్తున్నవెందుకు
మానవత్వాన్ని మూలన పడేసి
పెత్తనపు ఆరాటంకై
క్రూరత్వ నింపుకుంటావెందుకు
నీవేమైన సహస్ర వసంతాలు
మనుగడ
సాగిస్తానని ముద్రేసుకుంటివా !
క్రమదోపిడీకి, విధ్వంసపుకుట్రలకు,
కపట కుతంత్రాలకు మోసం,దగా
ఆలోచనలకు
స్వస్తి పలికి విశ్వ మానవాళి శాంతి
సౌఖ్యం కై. కాస్త సగటుమనిషిగ.
చేయూత నందిస్తే అజేయుడవే.

-యరకల యాదయ్య.

అమ్మ కనిపించింది !

ఇన్ని వాస్తవాలు తెలిసినాక
కలగనుట
కన్నుల పుణ్యమే!.
ఇన్ని త్యాగాలు చేసినాక
నిజమగుట
స్వప్నాల ఫలమే!.
పడక పట్టుపాన్నే
నిదురను కప్పేసుకోదు
మెలుకువ ను దులిపేసుకోదు!.
నడక బాటవేసిన
మనిషిని మరువదు
పేరు పేరునా పిలుచుకుంటది!.
నగర ట్రాఫిక్ లో ఇరికిన
నరునికి
ఏ నగరమైనా
స్వర్గధామం అవుతుందా!.
అరణ్యాలు ఆదిమానవున్ని
అమ్మ వలె చూసుకున్నవి
ఆధునిక జనారణ్యంలో
అమ్మ అగుపిస్తలేదు !.
పాత్రల్ని తళతళలాడేలా తోమేది
మిగిలిన అన్నం కూరలు తీసుకెళ్లేది
అప్పుడు ఆమె పనిమనిషి !.
ఊరు నుండి అమ్మానాన్నలు
డబ్బులు పంపడం ఆలస్యమైతే
అర్ధాకలే! సద్దన్నం కూడా కరువే!
పనిమనిషి తన జీతం డబ్బులతో
సన్నబియ్యంతెచ్చి కడుపునింపినపుడు
ఆమెలో అమ్మ కనిపించింది !

-పి.బక్కారెడ్డి
9705315250

ఏడేడు జన్మల- బంధమది ఏడడుగుల- పథమది

తీర్చుకుంటే
తీరని ఋణమది.
తీరకుంటేనే బాగది
తీయని ఊటది.
అతడొక చంద్రుడు
ఆమె వెన్నెల!.
అతనొక నక్షత్రం
ఆమె కాంతి!.
వాక్కతడు
అర్థమామె!
అతనెప్పుడూ

ఒప్పుకోను ఎవరన్నా!!!

గతాన్ని అవసరం లేని వస్తువులా
విసిరి వేయమనడం నచ్చదు నాకు
దాన్ని తలచుకొని బాధపడొద్దంటే
అంగీకరించడం ఇష్టముండదు అసలు..
పాతే కదా అని రోతగా చూడడం,
ఎప్పుడూ అదేనా!
అని వింతలు పోవడం
ఇవేవీ ఒప్పను, తక్కువనను...
అక్కడినుండే మొదలైంది కదా ఇది!
ఆ తోవంతా మలుపులెన్నో ..
మనసును కుదిపేసిన ఆరాటలెన్నో
చీల్చిన గాయాలెన్నో..
కంటినిండా కురిసిన రాత్రులు
మకరందాలను చిందించిన ఉషస్సులు
మమకారాలను తోడిన లోతులు
ద్వేషాన్ని చిలికిన అంతర్మథనాలు
ఎక్కడో పుట్టి ఇంకెక్కడో ఆగిన స్నేహాలు.
వాటన్నింటిలో తలమునకలుగా
రేపు ఉందో లేదో తెలియకుండా
వుంటుందనే ఆఖరి ఆశతో..
అలసిపోతూ ఈదిన గత సంద్రం..
పోతేనే కదా తిరిగి వచ్చేది
చచ్చినప్పుడే పుట్టుకకు విలువ
చావడానికే పుట్టడం
పుట్టినందుకు చావడం..
అందుకే...
గతాన్ని తవ్వొద్దు అనకండి
అస్సలు ఒప్పుకోను..!!

-అరుణ ధూళిపాళ
ఆలుమగలు.

అర్ధనారీశ్వరుడే.
ఆమె ఆలోచన
అతని ఆచరణ.
అతని నడక
ఆమె అనుసరణ.
అదెంతో ఉన్నతం
కదు రమణీయం.
మోహనంగా రవళించే
వీణ ఆమె
తంత్రులు మీటే వాదకుడతడు
రాగం,తానం పల్లవుల గీతమే
ఆ ఆలూమగల సంసారం!
అతనికి-ఆమె; ఆమెకు-
అతడు వెలుగు నీడలే మరి!
నీడంటే - వీడని బంధమది
మదిమదిలో అంకురించే భావమది!
భావానికి భాష్యమే!
లేదు మరి
అనుభవసారమే ఆలూమగలు

-రంగరాజు పద్మజ

చదువుల తల్లి బడి

బడి పైసల గలగల తడి గాదు
బాటల ఊటల పాఠాల మాటల తోట
బడి గోడను తాకి చూడు
పిల్లల భవిష్యత్తు వెలుగులైన
అక్షరాల ఝరి అల్లరి చేసుకుంటూ
పారుతుంది
ఒక్కొక్క పలకను పట్టుకొని చూడు
దేశ భవిష్యత్తు గీతలు రాసి ఉంటాయి
విద్యార్థి మనసు గుహలో
కొంత సేపు గడిపి చూడు
ముందు తరాల పచ్చని చెట్ల
పసి పసి పలకరింపులు ఉంటాయి
వారు కూర్చున్న బళ్లను
పట్టుకొని చూడు
అది నీతో మాట్లాడుతుంది
నవ సమాజపు వెలుగు రేఖలను
తన ఎదపై మోస్తున్నానని
ఒక్కసారి రాతలు రాస్తున్న
కలంను కదిలించి చూడు
అభివృద్ధి దారుల అంతరంగమై
పురిటి నొప్పులు మోస్తూనే ఉంటది
కలల సౌదాల అక్షరాలను
కంటూనే ఉంటది
ఉపాధ్యాయుని కదిలించి చూడు
విశ్వవిజ్ఞానపుగని గొంతు కాలువల
నిండా సజీవంగా
పారుతూనే ఉంటుంది
విజ్ఞానపు కాంతుల వర్షాన్ని
పిల్లలపై మంత్రించి
చల్లుతూనే ఉంటాడు
సరస్వతి తల్లినీ పిల్లల నాలుకలపై
నాటుతూనే ఉంటాడు
కదిలే చదువుల అమృత కలశం
అతడే

-గుండెల్లి ఇస్తారి
9849983874

కుంటి చేయికి ప్రాణం వచ్చింది

ఆలోచనలు అదే పనిగా వస్తున్నప్పుడు
నోటితో చెప్పటం సులభమే
కానీ -
ఇది పరీక్షా సమయం
మూడు గంటల్లో పరీక్ష రాయాలి !
రాసే కుడి చేయి
కుంటిదైపోయింది యాక్సిడెంట్లో -
ఎడమ చేయికి ఏది అలవాటు కాలేదు
నా ఆలోచనలోని
జవాబులు అన్నీ రాయడానికి
ఒక వ్యక్తి అవసరం !
ఆ వ్యక్తి అక్షరాస్యుడై ఉండాలి !
నేను చెప్పిన భావాల్ని
యధాతథంగా రాయగలగాలి !
అప్పుడే నేను
పరీక్షల్లో జయించగలను !
నా చేయిని
ఒక్కసారి చూసుకున్నాను
అది రవ్వంతా కూడా
కదలటం లేదు
ప్రశ్నపత్రం పర్వతమంత
నా ముందుంది.
పర్మిషన్ లెటర్ పక్కనే ఉంది
సబ్మిట్ కూడా చేశాను
పరీక్ష మొదలవడానికి
ఎదురుచూస్తున్నాను
మూడు గంటల్లో ముగించాలి !
యాక్సిడెంట్లో కుంటుబడిన చెయ్యిని
ఒక్కసారి చూసి తిట్టుకున్నాను
బాధపడ్డాను
ఏం లాభం ?
ఏది ఏమైనా పరీక్ష రాయాలి !
నాకు బదులు
నా పరీక్ష రాసే సహాయకుడు(స్క్రైబ్)
అప్పుడొచ్చాడు
నిజంగా ఒక్కసారి నాకు
ప్రాణం వచ్చినట్టయ్యది !!

- కందుకూరి శ్రీరాములు

ఒంటరి సున్నాను!

నాది కఠినమయిన పరిస్థితులున్న
సియాచిన్ యుద్ధ క్షేత్రమే
సైనికుడిలా నాది రోజూ యుద్ధమే
అమ్మ అకాలమరణం నుండి
అమ్మ ఎడబాటు పోరాటం నాది
అమ్మా! నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా
నా గుండె బరువవుతుంది
నా రెండు నయనాలు
నదులవుతున్నాయి
ఇపుడు ఈ నదులు
అంతర్ధానం అయ్యే
నీ ప్రేమమహా సముద్రం
కానరావడం లేదమ్మా
ఈ అవనీతలంలో.
నా జీవితం
నువ్వున్నప్పుడు
సందివర్ధనంలా నవ్వుతుండేది
బలవంతుడిలా,'కల'వంతుడిలా
సశక్తిగా చలనశీలంగా సంచరించేది
నువ్వులేని వర్తమానం
జడపదార్థంగా మారింది
నా జీవితం
ఒక్క గాలివానకు నేల రాలిన
దశాబ్దాల మహాతరువులా
వేసవిలో వెలవెలబోతున్న
ఊరిచెరువులా ఉంది
నీ 'ప్రేమ మహాసముద్రం' లేని
భూమిది
ఏదో వెలుగుదనం లోపించి
కనిపిస్తుంది
నువ్వు లేని మహావెల్తిని పూడ్చడం
సాధ్యంకాదని నాకు అనిపిస్తుంది
నా జీవితం
తెరచాప లేని నావ లాగ సాగుతుంది
అమ్మా నువ్వు లేని ఈ భూలోకం
అందాన్ని కోల్పోయిందనుకుంటున్నాను
నా జీవితం అచ్చం
జీవజలం అడుగంటిన మహానదిలా
ఆకులు రాల్చిన అడవిలా ఉంది
అమ్మా నీ ప్రేమ లేక నేను
ఎడమకుడిగా ఏ అంకెలేని ఒంటరి
సున్నాను
ఈ ప్రాకృతిక ప్రపంచంలో
నేను ప్లాస్టిక్ బొమ్మలా ఉన్నాను
జీవితానికి ఏది పూర్ణమో అది 'అమ్మ'
'అమ్మ ప్రేమ'లేని ఎవరిజీవితమయినా
అసంపూర్ణమే.

-రమేశ్ నల్లగొండ
8308452179

శ్రీ పార్వతి సిద్ధ రామేశ్వర క్షేత్రం

దక్షిణ భారత దేశంలోని అరుదైన శివాలయాల్లో దక్షిణ కాశీగా పేరొందిన శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి క్షేత్రం అత్యంత మహిమాన్వితమైనది. ఈ క్షేత్రం కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు గ్రామంలో ఉంది. సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన పుణ్య క్షేత్రం సిద్ధ రామేశ్వర క్షేత్రం. సిద్ధగిరి, రామగిరి అనే యోగి పుంగవులు శివుని తపస్సు చేసుకుంటున్న ప్రదేశంలో ఉన్న పుట్టపై ప్రతిరోజు ఒక ఆవు వచ్చి పాలధారలు కురిపించేది.అది చూసి విస్మయమందిన వారు మరింత తపోదీక్షలో ఉన్న సమయంలో పుట్టలోనుండి శివుడు సాక్షాత్కరించి నేను ఈ ప్రదేశంలో స్వయంభువుగా కొలువై ఉంటాను. మీరు ఇరువురు దేవాలయాన్ని నిర్మించాలి. అందుకు కావలసిన ద్రవ్యాన్ని సమకూర్చుకునే మార్గోపదేశం చేస్తాను అంటూ తాళపత్ర గ్రంథాన్ని వారికి అందించి పరమ శివుడు అదృశ్యమయ్యాడు. ఆనాటినుంచి సిద్ధగిరి రామగిరి ఇద్దరు తాళ పత్ర గ్రంథాన్ని చేతపట్టుకొని ఊరూరా తిరుగుతూ ఉండగా ప్రజల నుండి విశేషమైన స్పందన రావడంతో దేవాలయ నిర్మాణానికి కావలసిన సొమ్ము సమకూర్చుకొని దేవాలయ నిర్మాణం చేపట్టి సఫలీకృతం అయ్యారు. నాటినుండి వీరిరువురి పేరుమీదుగా ఇక్కడ వెలసిన క్షేత్రం సిద్ధ రామేశ్వర క్షేత్రంగా,స్వామిని సిద్ధ రామేశ్వరునిగా వ్యవహరిస్తున్నారు.

సిద్ధ రామేశ్వర క్షేత్రం పలు విశేషాంశాల సమాహారంగా విలసిల్లుతుంది. ఈ క్షేత్రం పవిత్ర కాశీ క్షేత్రాన్ని తలపిస్తుంది. గర్భాలయంలో భూగర్భం నుండి స్వయంభువుగా వెలసిన శివుడు లింగాకారంలో లోపలికి తిరిగి ఉండటమే కాకుండా, పానపట్టం తూర్పు వైపు ఉండడంతో పాటు గర్భాలయ అంతర్భాగం నుండి సూర్యకిరణాలు పానపట్టం మీదుగా స్వామివారిపై ప్రసరించే అద్భుత దృశ్యం భక్తహృదయాలను పులకరింప చేస్తుంది. శివలింగానికి వెనకవైపు పీఠంపై సిద్ధ రామేశ్వరుని పంచలోహ విగ్రహం ఉండి, దానికి ఇరువైపులా సిద్ధగిరి, రామగిరి విగ్రహా లతో పరివేష్టిత మై ఆలయానికి మరింత వన్నె తెచ్చింది. గర్భాలయంలో ఉన్న శివలింగం క్రమక్రమంగా పెరుగుతుండటం స్వామివారి మహిమకు దృష్టాంతంగా చెప్పవచ్చు. సాధారణంగా శివాలయానికి వీరభద్రుడు క్షేత్రపాలకుడిగా ఉండడం ఆనవాయితీ. అయితే ఇక్కడ మాత్రం వీరభద్రుని ఆంజనేయుని రూపంగా భక్తులు దర్శించుకోవడం పరిపాటిగా కనిపిస్తుంది.

ఏడంతస్తుల రాజగోపురం దానిమీద ఏడు కలశాలతో అత్యంత రమణీయంగా ఉండి ఆధ్యాత్మిక శోభతో అలరారుతుంది.

ఈ ఆలయంలోని మరో విశేషం ఏంటంటే గర్భాలయానికి ఆగ్నేయ దిశలో మూల బావిని నిర్మించి అందులో లింగ ప్రతిష్ట చేశారు. ఈ మూలబావి లోని ఔషధ గుణాలు గల పవిత్ర జలాన్ని సేవించడం వల్ల సర్వరోగ నివారణ జరిగి సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.ఆలయ ప్రాంగణంలో పార్వతీదేవి, ఆంజనేయ స్వామి,ఓంకారేశ్వరుడు, దత్తాత్రేయ స్వామి వంటి ఉపాలయాలు దర్శనమిస్తాయి.

దోమకొండ సంస్థానమును పాలించిన పాకనాటి రెడ్డి శాఖకు చెందిన కామినేని వంశీయులకు బిక్కవోలు (నేటి భిక్నూర్) తొలి రాజధాని. ఈ వంశమునకు చెందిన కామినేని మల్లారెడ్డి తమ కావ్యములను భిక్కనూరులో వెలసిన స్వయంభూ సిద్ధరామేశ్వరునికి అంకితం ఇచ్చినాడట. దోమకొండ సంస్థాన పాలకులు భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి వారిని ఆరాధించినట్లు, వీరి కాలంలో దేవాలయ ప్రాంతంలో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలుస్తుంది. నాటి నుండి నేటి వరకు ఈ దేవాలయంలో స్మార్త వైదికాగమ విధానంలో స్వామివారికి వంశపారం పర్య అర్చకస్వాముల ద్వారా నిత్య పూజా ధూపదీపనైవేద్యాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. ప్రతి సోమవారం స్వామివారికి వారోత్సవసేవ జరుపుతారు.

ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రావణ,కార్తీక మాసాలలో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు మహాశివరాత్రి పుణ్యదినాన లింగోద్భవ సమయం వరకు అభిషేకాలు అర్చనలు విశేషంగా జరుగుతాయి అంతేకాకుండా ప్రతి ఏటా స్వామివారికి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఫాల్గుణ మాసంలోని పౌర్ణమి తిథి అనంతరం వచ్చే శనివారం మొదలు కొని ఐదు రోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో మొదటి,చివరి రోజులలో పల్లకిలో ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాలలో మూడవ రోజున పార్వతి గంగా సమేత సిద్ధ రామేశ్వర కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరుగుతుంది బ్రహ్మోత్సవాలలో నాలుగవ రోజు విమాన రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ విధంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తజనుల పాలిట కల్పతరువులవుతాయి.

ఈ దేవాలయానికి దేశం నలుమూలల నుండి భక్తులు రావడానికి బస్సు రైలు ప్రయాణ మార్గాలు అందుబాటులో ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల తోపాటుగా కర్ణాటక మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుండి జనం తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు

ఈ ఆలయంలో అభిషేకం తోడే కట్టుట అన్న పూజ కుంకుమ పూజ ఒడి బియ్యం అన్నప్రాసన వాహన పూజ సత్యనారాయణ స్వామి వ్రతం వంటి సుమారు 30 రకాల ఆర్జిత సేవలు అందుబాటులో ఉంటాయి



ఈ ఆలయంలో భక్తులు ఎవరైతే 41 రోజులు దీక్షా బద్ధులై స్వామివారిని సేవించుకుంటారో వారికి కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం

దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఏ కేటగిరి దేవాలయం గా గుర్తింపు పొందిన మహిమాన్విత దేవాలయం శ్రీ పార్వతీ సిద్ధ రామేశ్వరాలయం ఈ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం స్థానిక నాయకులు చొరవతో నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 80 లక్షల వ్యయంతో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు

శ్రీ పార్వతీ సిద్ధ రామేశ్వర స్వామి సబ్బండ వర్ణాల కు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు ఈ క్షేత్ర దర్శనం సర్వపాపహరం సర్వదుఃఖ ఉపశమనం

స్వామిని దర్శించండి
స్వామిని సేవించండి
తరించండి

-డా. నమిలకొండ సునీత
9908468171

కవి

నిరంతర కల్లోలిత
అంతరంగ కురుక్షేత్రంలో
తన భావనా బలానికి తోడుగా
పద సైన్యాన్ని వెంటపెట్టుకొని
తనను వేధించే సమస్యలపై
ఆలోచనల నిశిత శరాఘాతాలను ఎక్కుపెట్టి
నేరుగా గుండెల్లోకి గుచ్చుతాడు కవి
బోధ పడని అర్జునుడై
గీతను బోధించే కృష్ణుడై
దిక్కుతోచని శిష్యుడై
దిశానిర్దేశం చేసే గురువై
తనకు తానే ప్రశ్నయి
తన ప్రశ్నకు తానే బదులై
నిత్యం తనలో తాను
సంఘర్షణల
కురుక్షేత్ర సంగ్రామం జరుపుకుంటూ
సంశయాల మబ్బులను పోగొట్టి
సరికొత్త గీతా సందేశమిస్తాడు
ఎన్నో ఏళ్లుగా సాగుతున్న
హృదయ సాగర మథనాన్ని
ఓర్పుగా నిరీక్షిస్తూ
గరళాన్ని గళంలో నింపుకొని
అమృతాన్ని కలంలో పంపుకొని
కవితామృత ధారలలో
పిపాసుల హృదయ దాహార్తిని తీరుస్తాడు
కవి ఒక విరించి
చతుర్ముఖుడై అన్ని దిక్కులూ చూస్తాడు
కవి ఒక 'కల'కంఠుడు
కలమే కంఠంగా చేసి మాట్లాడుతాడు
కవి ఒక విష్ణుమూర్తి
సమస్యల జడివానలో
గోవర్ధనగిరిని గొడుగులా పట్టి కాపాడుతాడు
త్రిమూర్తుల మారురూపు కవి
ముగ్గురి పనిని ఒక్కడే చేస్తూ
తన సూక్ష్మరూపాన్నే విశ్వరూపంగా చేసి
త్రివిక్రముడై మూడు అడుగులతో
లోకమంతా వ్యాపిస్తాడు
త్రినేత్రుడై విశ్వమంతా
భావి కంటితో చూస్తాడు

-డి.క్రాంతి కుమార్
7396721108

అనుభవాలే మెట్లుగా!

ఒక పక్షి శోకం నుంచే
శ్లోకంరూపెత్తి రామాయణం
ఆవిర్భవించింది
వేదనలోనుండే వేదం మొలకెత్తింది
ఆవేదనలోనుండే
విప్లవం పురుడుపోసుకుంటుంది
చిన్ననాటి హేళనలే
నిచ్చెనమెట్లుగా చేసుకుని
అంచెలంచెలుగా ఎదిగి
సాహితీఅంబరానికెగసిన
ఓ కవికోకిలా!
నీ కవితామృతధారలు
భావితరాలకు వెలుగుబాటలందించే
నిత్యస్రుతిశుభగములు
నిరంతర చైతన్యప్రవాహాలు
చీకటిముద్దవంటి తబిసిపిట్టకు
మనఃకాంతుల వెలుగులునింపి
పరమాత్మకు సందేశమంపినావు
మాయామయమత్తు జగతిలో
తూగిచరించే ముసాఫరులకు
జగన్నాటక తత్వబోధచేశావు
మనస్సుకు మయిల అంటదని
మానవత్వమే పరమాత్మతత్వమన్న
ఓ నవయుగకవి చక్రవర్తీ!
కలియుగాన కృతయుగధర్మాన్ని
పునఃప్రతిష్టచేయాలనిగమ్యంలేనిపరుగులతో
నలిగి పోతున్న విలువలతో మగ్గిపోతున్న
సంకుచిత సమాజంలో జీవనపోరాటంచేసి
అనుభవాలే అక్షరాలుగామలచి
యశోభూషణుడవైనావు
వెలిపొందినచోటనే కనకాభిషేక గండపెండేరాది
లెక్కకుమించిన గౌరవపురస్కారములనంది
"విశ్వనరుడ " నేనని సగర్వముగాచాటినావు
ఓడినచోటే తలయెత్తి
ఠీవిగానిలిచినావు.

-డా.మైలవరపు లలితకుమారి
9959510422

అవగాహన గీతం

॥పల్లవి॥ఎదుగుతున్న ఓ యువతరమా!
మారుతున్న ఓ భారతమా!
ఓటు బాధ్యతలు తెలుసుకో!
నీ భవితకు భరోస దెచ్చుకో!

చ:జీవిత గమనము మార్చునురా,
నీ ఓటు తెచ్చును మార్పునురా
మారుతున్నది కాలం॥2॥
ఇది ప్రగతి పదానికి మూలం॥ఎదు॥

చ: భవితవ్యానికి చేటూ,
కారాదెప్పుడు ఓటూ
అస్త్ర శస్త్రముల మించినదీ॥2॥
అందరి చేతికి అందినదీ॥ఎదు॥

చ:సమస్య వ్యతలను తీర్చూ,
సమాజ గతులను మార్చూ
వజ్రాయుధమున కన్నా ॥2 ॥
నీ ఓటాయుధమే మిన్నా॥ఎదు॥

చ:మత్తుకు బానిస కాకూ,
మందీ డబ్బుల కాశాపడకూ
అమ్మబోకు నీ ఓటు ॥ 2 ॥
అది భవితకు చేయును చేటు॥ఎదు॥
చ: రాజ్యాంగము నీకిచ్చిన హక్కూ,
అది వినియోగించుము పెక్కూ
అలసత్వము నీకొద్దూ॥ 2 ॥
ఓటును అమలు చేయుటే ముద్దూ॥ఎదు॥

చ:భూతకాలమున జరిగినదీ,
వర్తమానమున జరుగుతున్నదీ
భవిష్యత్తుకు బహు బరోసనిస్తూ॥2॥
ఓటునుపయోగించుము శాసిస్తూ
॥ఎదు॥
చ:నోట్లకోట్లు ముడిపెట్టకుమా,
అవినీతిని ఆశించకుమా
ఓటు విలువ వెలకట్టలేనిది॥2॥
సమాజ గతులను మార్చునదీ॥ఎదు॥

-పోమాల హన్మంతు
9989934521.

ప్రజా కవి కాళోజీ

కాళోజీ అంటే ఒక అక్షరం గళం
కాళోజీ ఒక అక్షర యుద్ధం
కాళోజీ నిరంతర ఉద్యమ జీవి
ప్రశ్నించే గొంతుక కాళోజీ!.
వివక్షత ఎక్కడున్నా వ్యతిరేకించే కాళోజీ
మంచి ఎక్కడున్నా స్వాగతించే వ్యక్తి కాళోజీ
అన్యాయం అనిచివేతలపై
తిరగబడ్డ కాళోజీ
తెలంగాణ వైతాళికుడు కాళోజీ!!
జీవభాష వైపే మొగ్గు చూపే కవి కాళోజీ
వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది
వీరై కూడా తెలంగాణ వీర తెలంగాణ ముమ్మాటికి
ఎలుగెత్తి చాటిన ప్రజా కవి కాళోజీ!!!.
కాళోజి కవిత్వంలో కథల్లో
స్వచ్ఛత కలిగిన కాళోజీ
అన్యాయాన్ని ఎదిరించినోడే
తనకు ఆరాధ్యుడని చెప్పిన కాళోజీ
స్వచ్ఛమైన మనసున్న ప్రజాకవి కాళోజీ
తెలంగాణ ఆధునిక సాహిత్య
ముఖద్వారం కాళోజీ
కాళోజీ కవిత్వం భావితరాలకు
ఆదర్శం!!!

-దేవులపల్లి రమేశ్
సెల్:9963701294

మళ్లీ ఆ రోజులు రావాలి

చెట్టుకు కొమ్మలు ఎన్నో
కదదాకా కలిసీ మెలిసే.

పిల్లలు ఎందరున్నా ఏం లాభం?
విడివిడిగానే కాపురాలు.

తల్లి తండ్రుల నివాసాలు
వృద్ధాశ్రమాల చెంతే.

సంస్కృతి నేర్పిన పాఠాలు
ఎక్కడా లేవులే ఈనాడు
విదేశీ సాంప్రదాయలే ముద్దు
విలువలు లేని జీవనమే ముద్దు.

పెళ్లి పుస్తకం విడాకులూ
ప్రక్క ప్రక్కనే నేస్తాలులా
ఒకదాని వెంట ఒకటి పరుగులు.
పబ్లు డేటింగులు సహజీవనాలు
సమాజం బాటే మారి పోయింది.

అడ్డదారులే అందంగా కనిపిస్తున్నాయి
రాచబాటను ఏనాడో మరిచారు.

పాత పద్ధతులకు పంగనామం పెడుతూ
కొత్తదనానికై అడుగులు కదుపుతున్నారు.

ఆకాశానికి ఎగరబోయి అగాధాల పాలవుతున్నారు
పాత ఎప్పుడూ కొత్తే నానుడి
మళ్లీ రావాలోయ్ మనల్ని మురిపిస్తూ.

భారతీయత వెల్లివిరియాలి
ప్రపంచంలో మన స్థానం సుస్థిరమవ్వ

-యలమర్తి అనూరాధ
సెల్:9247260206

బాల్యం విద్యాలయం

తెలియలేదు
అమ్మ కొంగు చాటున ఉన్నపుడు
అనుబంధాన్ని మించిన
రక్షాకవచం లేదని!

అనుకోలేదు
నాన్న వేలు పట్టుక నడిపించినపుడు
తాను జీవిత గమ్యం వైపు నడిపిస్తున్నాడని!

చెప్పలేదు
భుజాన ఎక్కించుకున్నపుడు
నేను ఉన్నత స్థితికి ఎదగాలని
నాన్న కోరికని!

మహత్తు ఏమిటో
అమ్మ నా జుట్టు నిమిరినపుడు
ఒత్తిడంతా మటుమాయం అయ్యేది
మత్తుగా నిద్ర వచ్చేది!

అమ్మ గోరు ముద్దలో
అమృతముండేది
నాన్న అడుగు ముద్రలో
జీవిత గమనం కనిపించేది!

ఇప్పుడనిపిస్తుంది
బాల్యానికి మించిన విద్యాలయం లేదని
అమ్మా నాన్నలే మొదటి గురువులని!

-జగ్గయ్య.జి
9849525802

ఆనంద తాండవాలు

అహంకారం ఆత్మీయుల విరోధం
దురాశల లోభి జీవితం వ్యథ భరితం
అసత్యం అపజయాల వాహనం
సంతోషమే సంపూర్ణ బలగం
కాలగర్భంలోకి నెట్టేదే అధర్మం !

సమస్యల తోరణాలు సర్వవ్యాప్తాలు
కరువుకాటకాలు కాలసర్ప కాట్లు
మాటల మంటల్లో శాంతి భస్మాలు
ఆలుమగల అలకలు సర్వసామాన్యాలు
కలతలు ముదిరితేనే ఇడుపుకాగితాలు !

నా అంటే స్వార్థపు కుంపట్లు
మన అంటేనే లోక కళ్యాణాలు
అసూయ ద్వేష ఈర్ష్యల కుప్పలు..
క్రోధ పగ ప్రతీకారాగ్నుల చెదలు..
కొరుక్క తింటాయి శాంతి సౌభాగ్యాలు !

మాట తీరును సంస్కరించుకొని..
ఓర్పు, సహనాల్ని అలంకరించుకొని..
స్థిర చిత్తంతో ముందుకు దూకితేనే?
సమస్యల చింతలు ఆమెడ దూరం
సానుకూల ఆలోచనలు నిండితేనే..
మనసుల్లో ఆనందతాండవాలు !

-మధుపాళీ
9949700037

ఆనందోత్సాహాల నడుమ నేటికవిత ఆత్మీయ సమ్మేళనం

నగునూరి రాజన్న రాసిన 'వెలుగు పూలు' పుస్తకావిష్కరణలో అతిథులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 26:ఉదయసాహితి తెలంగాణ ఆధ్వర్యంలో అంతర్జాల సమూహం లో నిర్వహింపబడుతున్న నేటికవిత ఆత్మీయ సమ్మేళనం ఫిబ్రవరి23న ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది., రెండు తెలుగు రాష్ట్రాల లోని నేటికవిత సభ్యులు ఈ సమ్మేళనం లో పాల్గొని సమ్మేళనానికి నిండు శోభను కూర్చారు. ఆత్మీయ పలకరింపుతో, సాహిత్య సంబంధ ఊసులను పంచుకోవడానికి ఖమ్మం లోని బోడేపూడి విజ్ఞాన కేంద్రం వేదికైంది.

సభలో ప్రసంగిస్తున్న దాస్యం సేనాధిపతి.

సభలో ప్రసంగిస్తున్న రమాదేవి కులకర్ణి

ఉదయసాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి పురిమళ్ల సునంద గారు వారి శ్రీవారి శ్రీ భోగోజు ఉపేందర్ రావు సమ్మేళనానికి హాజరైన ప్రతినిధుల కు ఆతిథ్యాన్నిచ్చి,అందరినీ సాదరంగా ఆహ్వానించారు. నేటికవిత అడ్మిన్ శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య, నేటి కవిత సలహాదారు శ్రీ దాస్యం సేనాధిపతి పర్యవేక్షణలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహింపబడినాయి. ఉదయం పదిగంటలకు జరిగిన ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా శ్రీ భోగోజు ఉపేందర్ రావు గారు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సమ్మేళనాన్ని ప్రారంభించారు.

ఉదయసాహితి రాష్ట్ర బాధ్యులు

శ్రీ శ్రీదాస్యం లక్ష్మయ్య, శ్రీ దాస్యం సేనాధిపతి, పురిమళ్ల సునంద గార్లతో పాటు ఖమ్మం అక్షరాల త్రోవ మిత్రులు రాచమల్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్, నామా పురుషోత్తం వేదికను అలంకరించారు. సమావే శంలో దాసరోజు శ్రీనివాస్, నామా పురుషోత్తం, శ్రీమతి ముద్దు వెంకట లక్ష్మి , తదితరులు అతిథి సందేశాల ను అందించారు. అనంతరం స్వీయ పరిచయాలను మూడు ఆవృతాలలో నిర్వహించారు. కవయిత్రి శ్రీమతి బత్తిన గీతాకుమారి స్వాగతం పలికారు.

పుస్తకావిష్కరణలు

ఈ ప్రారంభ సమావేశంలో కరీంనగర్ కు చెందిన కవి నగునూరి రాజన్న రచించిన హైకూల సంకల నం వెలుగు పూలు ను దాస్యం సేనాధిపతి ఆవిష్కరించగా , మంగా నెల్లూరు కు చెందిన కవి యర్రాబత్తిన మునీంద్ర రచించిన కలల కావడి సంకలనాన్ని శ్రీదాస్యం లక్ష్మయ్య ఆవిష్కరించారు.

స్వీయ పరిచయ వేదికలు

ఆత్మీయసమ్మేళనానికి హాజరైన కవులు కవయిత్రులు స్వీయపరిచయ వేదిక ద్వారా తమను గురించి తాము పరిచయించుకున్నారు. శ్రీమతి లక్ష్మీ పద్మజ దుగ్గరాజు గారి అధ్యక్షత న జరిగిన మొదటి ఆవృ తంలో దాస్యం సేనాధిపతి, శ్రీదా స్యం లక్ష్మయ్య, పురిమళ్ల సునంద, కె.మంజుల, కందుకూరి మనోహర్, ఏడెల్లి రాములు, గుడ్లదొన సాయి చంద్ర శేఖర్, కె.వి. సుబ్రహ్మణ్యే శ్వర రావు, మేరుగు అనురాధ, నగునూరి రాజన్న, తుంబూరు జగన్మోహన్ తదితరులు తమ స్వీయ పరిచయం సాహిత్య ప్రస్థానాన్ని, నేటి కవితతో తమకు గల అనుబంధాన్ని గురించి వివరించారు.

రెండవ ఆవృతంలో...

శ్రీమతి రమాదేవి కులకర్ణి అధ్యక్షతన జరిగిన రెండవ ఆవృతం లో బత్తిన గీతాకుమారి, యర్రాబత్తిన మునీంద్ర, లింబగిరి స్వామి, ముద్దు వెంకటలక్ష్మి, చిందం సునీత, చింతల కమల, శింగరాజు శ్రీనివాస్ కుమార్, రమాదేవి బుక్కపట్నం, ఉదయశ్రీ ప్రభాకర్, యనమండ్ర వరలక్ష్మి, వేముల వరలక్ష్మి , పరిమి వెంకట సత్యమూర్తి, తదితరులు తమ స్వీయ పరిచయం సాహిత్య ప్రస్థానాన్ని, నేటి కవితతో తమకు గల అనుబంధాన్ని గురించి వివరించారు.

సభలో అతిథులు

అనుబం ధాన్ని గురించి వివరించారు.

మూడవ ఆవృతంలో...

డా.చీదెళ్ల సీతాలక్ష్మి గారి అధ్యక్షతన జరిగిన మూడవ ఆవృతం లో లింగుట్ల వెంకటేశ్వర్లు, సయ్యద్ జహీర్ అహ్మద్, డా. ఆదేరు చెంపయ్య, కటుకం కవిత, కొలచన విజయభారతి, బిరుదురాజు ప్రమిలా రాణి, మూర్తి శ్రీదేవి, తులసి వెంకట రమణాచార్యులు, అరుణ కీర్తి పతాక, అక్కి నర్సింలు, కె.మంజుల, కందుకూరి మనోహర్, గౌడ్, తదితరులు తమ స్వీయ పరిచయం సాహిత్య ప్రస్థానాన్ని, నేటి కవితతో తమకు గల అనుబంధాన్ని గురించి వివరించారు.

అనంతరం ఉదయసాహితి సర్వసభ్య సమావేశం రాష్ట్ర గౌరవాధ్యక్షులు శ్రీ దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగింది.

భోజనానంతరం నేటికవిత సమూ హం లో అర్హత సాధించిన 10 మంది కవులకు కవయిత్రులకు కవితాభూషణ 08 మంది కవులకు కవయిత్రులకు కవితావిభూషణ ఐదుగురికి సహస్ర కవితా స్ఫూర్తి అవార్డులను బహుకరించారు.

ఆత్మీ య సమ్మేళనానికి హాజరైన వారంద రికీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, శాలువాలతో అతిథులు, నిర్వాహకు లచే ఘనంగా సత్కరింప డం జరిగిం ది. అనంతరం మూర్తి శ్రీదేవి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

సభలో ప్రసంగిస్తున్న రమాదేవి కులకర్ణి

మల్లన్న భక్తుడికి గుండెపోటు.. సీపీఆర్ చేసి.. ప్రాణాలను కాపాడిన ఎస్ఐ

కరీంనగర్, ఫిబ్రవరి 26: మహా శివరాత్రి సందర్భంగా శ్రీ మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తుడు ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైన సంఘటన పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో చోటుచేస్తుంది. బుధవారం దర్శనానికి వచ్చిన భక్తుడు ఒక్కసారిగా గుండెపోటుకు గురై కింద పడిపోవడంతో ఆలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్, పోలీస్ సిబ్బంది గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. అప్పటికప్పుడే సదరు భక్తుడికి సీపీఆర్ చేసిన పోత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ వెంటనే తమ పోలీస్ వాహనంలో చికిత్స నిమిత్తం హాస్పిటల్ కి తరలించాడు.

వారం వారం కవితల వర్క్ షాప్ 4. అంశం: విగ్రహాలు 2025 నుండి ఫేస్ బుక్ లోని "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో నిరంతరాయంగా డా రావి రంగారావు నిర్వహిస్తున్న కవిత్వ కార్యశాల. ఈ వర్క్ షాప్ కోసం వచనకవిత /గేయం/ ఐదు పద్యాలు/ ఐదు మినీ కవితలు... ఏదో ఒక ప్రక్రియలో పాల్గొనవచ్చు...

ఈ 4వ వర్క్ షాప్ లో 21 మంది రచయితలు వారు తమ కవితలను పంపించారు.. వాటి నుండి నాలుగు ఉత్తమ కవితలకు మాత్రమే గ్రేడ్ ఇచ్చి ప్రశంసా పత్రాలు ఇవ్వడం

విగ్రహాలు

అవి విగ్రహాలా!
కాదు కాదు...
సత్యం ధర్మం త్యాగంతో
మదిని మథించిన
మానవతా ఉత్తమ
రస రమ్య ఫలాలు...
అవి విగ్రహాలు
కాదు కాదు...
సర్వంబు తానై మహోన్నతులు
విగ్రహంలో నిగ్రహమై దాగారు,
బ్రహ్మంలో ఉన్న వైభవములు చూపారు
ధర్మంబు నిఖిలంబు నిష్కర్షగా నిలిపారు
అవి విగ్రహాలు
కాదు కాదు...
మన బ్రతుకు మార్చిన
భాగవతోత్తములు,
మహిలో తిరిగిన మాధవులు,
మదిలో వెలిగిన జ్ఞాన జ్యోతులు,
చావు పుట్టుకల సారం
తెలిపిన బోధకులు...
అవి విగ్రహాలు
కాదు కాదు...
ప్రాణము లన్నిటిని ఏలుతున్న
మర్మ విరాగి జీవనులు,
ప్రబోధ సారముగా
గడిపిన ఆచార్యులు...
అనురాగాలకు చిరునామాలు,
అనుబంధాలకు నిలయాలు...
అవి విగ్రహాలా
కాదు కాదు...
నీవు పూజించదగిన
హృదయ స్పందనలు...
భక్తితో ఆర్తితో పిలిచినప్పుడు
సద్గుణాలను రగిలిస్తారు,
వేష ఆవేశాలను సరిచేస్తారు,
అనంతము నీవే నని
పరమాత్మలో చేరుస్తారు,
ఇప్పటికైనా పిలవరా, కొలవరా
సత్యం ధర్మం త్యాగ పలాలను!

-సత్యవతి, కరాలపాడు
పలనాడు

విగ్రహాలను చేసింది
కఠినమైన రాయితోనే అయినా..
అవి నిలబడినది మాత్రం
సంస్కృతి పునాదులపైనేగా ..!
విగ్రహాలు
కదలలేనివే అయినా ..
అవనిపై నడయాడిన
చరిత్రకు ఆనవాళ్లు అవి...
వాటిలో కొన్నింటి రంగు
శౌర్యం, రాజసం. దాతృత్వం...
మరి కొన్నింటి రంగు
సౌందర్యం, మంచితనం,
ప్రేమ, శృంగారం, భక్తి..!!
విగ్రహాలు..
మాటాడలేనివే అయినా
వాటి అణువణువూ
మహనీయులు నడిచిన
ఆదర్శపు నడకల జాడలే..
గత వైభవ ప్రకంపనలే
వీనులకు విందుగా
కనులకు కట్టినట్లుగా..!!
గాంధీజీ విగ్రహాన్ని చూసిన కనులకు
అహింసా మార్గము,
సత్యాగ్రహ పోరాటమే
కనులముందు కదలాడును కదా!
అవి వర్తమానానికి.. భవిష్యత్తుకు
గర్వకారణాలే..
అనుసరణీయములే..!!
విగ్రహాలు దేవాలయాల్లో వున్నా..
విద్యాలయాల్లో వున్నా
నడివీధుల్లో వున్నా..

ఓ శిలా!
దెబ్బలు సైపలేనని
ఉలికి పడకు!
నిన్ను విగ్రహంగా
దండలు వేయించుకునేలా
మలిచే శిల్పికి
ఉలికి దండం పెట్టు .
కొన్ని విగ్రహాలు
ఎన్నికల సమయంలో
ముసుగులు కప్పినప్పుడే
తెలుస్తుంది
అక్కడ అవి ఉన్నాయని
రాతిని విగ్రహంగా
మలిచేవాడు శిల్పి,
విగ్రహాన్ని రాజకీయంగా
వాడుకునే వాడు ఉలిపి.
కష్టాల దెబ్బలకు
కూలకు!
అధైర్యం,
అలసత్వం పెచ్చులు లేచేట్టు
నీకు అనుకూలంగా
"నిలబడు"
అప్పుడు నలుగురు మెచ్చే
"విగ్రహం" నీవి.
నిన్ను గొప్పగా నిలబెట్టేవి
విగ్రహాలు, గ్రహాలు కాదు
ధర్మాచరణలో
నీ మనో నిగ్రహాలు.

-గోలి హనుమచ్ఛాస్త్రి.
గుంటూరు

జనాన్ని ఆదర్శ మార్గంలో నడిపించే
జ్ఞాన దీపాలే కదా
వ్రాయబడని సూక్తి సుధావళియే కదా...!!

-ఎస్. ముంతాజ్ బేగం
ఏలూరు.

అమ్మ కడుపులో
దేవుడు చెక్కిన విగ్రహం
జీవాన్ని సంతరించు కుని
'మనిషి' గా మారింది...
గర్భగుడిలో
మనిషి చెక్కిన రాతి విగ్రహం
రూపాన్ని సంతరించుకుని
'దేవుడి' గా మారింది.
కోట్ల ఏళ్ల నుండి
ఎండుతూ తడుస్తూ నిశ్చలంగా
పడివున్న పాషాణానికి
'జీవం' పోసాడు శిల్పి.
వందేళ్ళకని వచ్చిన
మనిషి బ్రతుకు బాటలో
ఎండుతూ తడుస్తూ
'జీవనం' కోసం తపిస్తున్నాడు.
వేసే ప్రతి ఉలి దెబ్బకీ
అందం ద్విగుణీకృతం కాగా
అందమైన రూపం దాల్చి
పూజ లందుకుంటూ 'ఆ విగ్రహం'.
తగిలే ప్రతి ఎదురు దెబ్బకీ
గుండె దిటవు చేసుకుంటూ
మనుషుల చేత తొక్క బడుతూ
నిస్సహాయంగా 'ఈ మనిషి'.
శిల్పి చేతిలో విగ్రహంగా
మారిన బండ రాయి దండకానికి,
పూజలకు కరగడం లేదు.
దానిది 'రాతిగుండె'...
దేవుడు చేసిన మనిషి
ముఖ స్తుతికి, పొగడ్తలకు
కరిగి పోతున్నాడు.
కష్టాలకు చలించి పోతున్నాడు.
ఈ మనిషిది 'జాలి గుండె'.
మనిషి సృష్టించిన
దేవుడు కలకాలం ఉంటూ
తరతరాల చరిత్రకు
సాక్షిగా నిలిస్తే ...
దేవుడు సృష్టించిన
మనిషి తన మనుగడలో
ఉన్న కాలానికే పరిమితమయ్యాడు.
'మంది' కోసం బ్రతికి
'జనం' గుండెల్లో నిలిచి
కలకాలం చరిత్రలో
ఉండి పోతున్న మనుషుల్లో
'దేవుళ్లు' కొందరు.
వీరే అసలైన దేవుళ్లు.

-శ్రీనివాస శాస్త్రి, హైదరాబాద్



సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

మనసే మందిరమై!

చల్లని వెన్నెలలా
అలసిన మనసుకి సేదలు తీర్చేది.
మమతల కోవెలలో
లాలిస్తూ ఊయలలూపుతూ
చిలిపిగా అల్లరి చేస్తూ స్నేహ బంధంతో
నిను అల్లుకుపోయేది
అనురాగాల రాగాలను పండించేది.
యౌవన ప్రాయంలో అందాలొలికిస్తూ
మరుమల్లెల పరిమళాల
విరి జల్లులను కురిపిస్తుంది
మౌనంగానే కన్నులు కలిపేది..
మది వీణను మీటేది
ఇరువురి హృదయాలను కలిపేది
బంధాల అనుబంధాల లతలతో
నిను పెనవేసేది..
శిలను శిల్పంలా మలిచేది
మట్టిని మాణిక్యంగా మలిచేది
సుఖ దుఃఖాలలో వీడని నీడలా
నీ వెంటే ఉండేది
తోడూ నీడగా నేనున్నానంటూ
కడదాకా వదలను పొమ్మంటుంది..
సాగరమంత విశాలమైనది
నీలాకాశంలా నిశ్చల మైనది
అమూల్యమైనది ఈ
జీవిత సర్వస్వాన్ని అర్పించేది
దయా కరుణా వాత్సల్యం
సేవా త్యాగం మానవతా ధర్మంతో
విలసిల్లే ఆనందాల నిలయమిది
మనసనే మందిరంలో
నిర్మలమైన భావమది.

ఎంత రాసినా ముగింపు లేని కథ.. ప్రేమంటే

అలిసిపోని మది ఆరాధనే ప్రేమ
కనులముందు రూపానికి కట్టిపడేసేదికాదు
ఎదురు చూపు భారమంతా ఏకాంత మనే
వరం లో దాగే..
గడిపిన క్షణాలన్ని జ్ఞాపకాల పందిరి కింద
మనసు కోయిల పాడే విరహ గీతం ప్రేమంటే
ముగింపు తెలియని కథలే అన్ని రాసే వారులేక...
మనసు మూత తీసి చూడు మన్నింపులే
ఉంటాయి...
రాసే రాతలన్ని తన గురించని తెలియక
మనసు సంచి లోంచి తొంగి చూస్తుంది.
మది లోపల నీవుంటే కావలిగా నేనున్నానట్టు
కడలి లో తరంగమై కడవరకూ నీతోనే
అంటుంది ప్రేమ..
అలవికాని ఆరాధన లో అలిగి ఉంటుంది
మొదలు చివర తెలియక మొదలవుతుంది
నింపుకుంటే నిండుతుంది
గుండె నిండుగా
తెంపుకుంటే తెగుతుంది
గుండె మండగా
రాసి రాసి ప్రేమ కావ్యాలు
ఎన్నైనా కానీ
మిగిలి ఉన్న వారికి
తీపి గురుతులే...
ప్రేమ మధురిమ లోన
మునిగిన అందరికీ.

-కె.రాధికనరేన్
హన్మకొండ

పారిపోయి లేచిపోయేది కాదు

ప్రేమంటే రెండక్షరాలతో పెనవేసుకున్నది
హృదయంలో నిలిచి పోయేది
చెరిగిపోని కరిగిపోని బంధమై నిలిచేది
తన్మయత్వంతో నిండుకున్నది.
ఒకరినొకరు మనసిచ్చి పుచ్చుకుని
ఒకరికోసం ఒకరు బ్రతికేదని
దీనికి కులమతాలు అడ్డురావని
ఎవ్వరూ విడదీయలేనిదని
లైలా మజ్నూలే ఆదర్శమంటున్నారు నేడు.
కనీపెంచిన తల్లిదండ్రుల నొదిలేసి
వారు చూపిన మమతానురాగాలను మరిచేసి
నిన్న గాక మొన్న కలిసామన్నది మరిచి
ఒకరికోసమొకరం పుట్టామని గాలిమాటలాడేసి
నమ్ముకున్న కుటుంబీకులను వంచించి
వారి నమ్మకాలని వమ్ముచేసేసి
మా ప్రేమకన్నా తల్లీదండ్రులు గానీ
కట్టుబాట్లు గానీగొప్పోళు
ళ్ళ కాదంటున్నారు నేడు.
ప్రేమంటే.. పారిపోయి
లేచిపోయేది కాదు
ప్రేమ గీతాలతో
కాలక్షేపం చేసేది కాదు
బాధ్యతలు మరిచి ఆత్మహత్య
చేసుకునేది కాదు
నమ్ముకున్నోళ్ల నట్టేట
ముంచేది కాదు.
ప్రేమంటే అనురాగం
ఆప్యాయతలకు రూపం
ఏ కల్మషం లేని
జీవనానికి ప్రతిరూపం
అమ్మా ఆలి
సోదర సోదరీలెవరినైనా సరే
ఆరాధించి
ప్రేమామృతాన్ని పంచేది
వారి హృదయాలలో నిలిచుండేది.

-మండికారి బాలాజీ

మనసున మనసై

మదిలో తెలియని నా ఊహలు
మనసులో కదిలే నీ రూపాలు
చిరునవ్వుల మాటున పిలుపులు
నాలో తెలియని ఎన్నో గుసగుసలు
మనసున మనసై....
మధుర ప్రేమ
కదిలిన జ్ఞాపకాల దొంతరలు
మెదిలిన ఆలోచనల భ్రమలు
ఆలోచన కలిగిన కదలికలు
మెరిసిన ఆనందపు కేరింతలు
మనసున మనసై....
చిలిపి ప్రేమ
యేమని చెప్పను నేస్తం
ఎందాక చూడను ప్రియ నేస్తం
నీ కోసం వెతికే నా మనసు
అడియాశల ఆశల బతుకు
మనసున మనసై....
విరహ ప్రేమ
ఏదో చెప్పాలని తపన
ఏమి చెయ్యలేని నిరీక్షణ
అమాస చీకటిలో అంధకారమై
కను రెప్పల మాటున రూపమై
నా మనసున మనసై....
తొలి ప్రేమ
నీ తీయని పిలుపుకై నా ఆరాటం
నీ చిలిపి నవ్వుకై నా మౌన పోరాటం
నా మనసులో దాగిన యామిని
నా స్వప్నం లో విహరించే భామిని
రావా మనసున మనసై....
అమర ప్రేమ
మూడు ముళ్ల బంధంతో ఒకటై
ఏడడుగుల నడకతో తోడై
జీవితాన సగం నీకు నీడై
జన జీవన ప్రవంతిలో జాడై
ప్రేమ రెండక్షరాల తొలి ప్రేమ

- షేక్ రహీమ్ సాహెబ్
:7330938773

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1386వ రోజు 'అపార్థం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'అపార్థం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

అపోహలు

బంధు బలగాల మిత్రుల
బచ్చలి తీగల బంధాలలో బలమైనది
కలహాలకదియె వేదికయ్య
కాలు దువ్వే మార్గమేయును.
అనుమాన బీజాల అంకురాన
సంజాయిషీ సమాధానాల చెప్పనీయక
కోప తాపాల కొలనులోన మునిగి
చెప్పినా వినక..చెవికెక్కించుకోక
ఆప్త మిత్రునోలె అంటుక పోవును...
సమయానుకూల సమాచార లోపాలో
మాటలు కరువైన మౌనరాగాలో
ఊహల పల్లకిలో ఊరేగి పోయి
తోచిన కిచిడీలు వండుకోవడమే
తొంబదింటికి తోడయ్యే ముఖ్య మార్గం.
కాని వారి మాటలే కడు ప్రీతికరమై
బయటి వారి ముచ్చట్లు బహు గొప్పగా నప్పి
స్వంత ఆలోచనలకు కూడ స్వస్తి పలికి
గడ్డెద్దు చేలో గుట్టుగా మేసినట్టు
రంగుల ప్రపంచం చందంగ రాచబాటలేయు.
ఆరోగ్య పచ్చదనాలు వాడిపోయి
మనశ్శాంతి కుసుమ పరిమళాలు
మసకబారి బంధాల పోగులు
పలుచబడి బాంధవ్యాలు కారిపోవు.
సహన సంయనాలతో
సహవాసములు చేస్తూ
విజ్ఞాన విచక్షణలను
ఆయుధాలుగా మలచుకుంటే
అధిగమించవచ్చు అపోహలన్ని
గాలి మబ్బులై విడిపోయి.

- నగునూరి రాజన్న

తప్పుకోసం వెతుకులాట

అర్థం చేసుకోకపోవడం
అబద్ధానికి మూలం
అర్థం చేసుకున్న ఆత్మ
ఆత్మీయుడు అవుతాడు.
తప్పులెన్న వారు
తండోపతండంబు,
ఉర్జిజనుల కెల్ల ఉండు తప్పు!
మళ్లీ మళ్లీ చేయక
నడవడం సరైన పద్ధతి.
మనిషి, మనసు, ప్రవర్తన
అర్థం చేసుకున్న మంచికి
గోచరిస్తాయి సర్వం, సకలం
అద్భుతం, అపురూపం.
లేనివారికి కంతలు వెతికి
వింత వాసనలు చూసే
పృథ్వి అంతా
పుచ్చిపోవు చూపులు!.
సద్బుద్ధి, సదాలోచన
మనిషి మనుగడకు
ఆయువు పట్టు
రామ అంటే చెడ్డ మాట
అనే నానుడి కద్దు!
అందుకే
అర్థానికి
సరైన రూపం సజావుగా
చూస్తే సకలం
దివ్యం సంపూర్ణం!!
లేకుంటే
అపభ్రంశాల ఆలోచనలను
సకలం భ్రష్టత్వం, నాశనం.

-కె.కె.తాయారు

అనర్థాలకు మూలం

అపార్థం అన్ని అనర్థాలకు మూలం
కొందరి మాటలను ప్రవర్తనను
స్వయంగా అపార్థం చేసుకోవడం వేరు
బుద్ధిలేని వింత జీవుల
చెప్పుడు మాటలతో
అపార్థం చేసుకొని
దూరం పెట్టడం వేరు
కొందరికి
ప్రేమాభిమానాలు
సానుకూల దృక్పథం ఉన్నప్పటికీ
వ్యక్త పరచడంలో లోపంతో అపార్థం
మరికొందరికి
తమ కుటుంబ సభ్యులపై తప్ప
ఇతరులందరిపై
ఈర్ష్యాసూయలు ఉన్నప్పటికీ
మొహంపై నవ్వు పులుముకొని
కౌగిలించుకొని
ఆత్మీయుల్లా ప్రేమగా మాట్లాడితే
మనవారని చెప్పుకున్న కష్టసుఖాలపై
సహాయం చేయకపోయినా
ఇతరులకు పాస్ చేస్తూ
సంతోషిస్తారు.
కొంతకాలం తర్వాత అయినా
వారి నైజం బయటపడుతుంది
వారి నుండి ఎదుటివారు
బయటపడతారు.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

అపార్థంతో అనర్థాలు

చెప్పే విషయం
కప్పిపుచ్చకుండా
హృదయం విప్పి
చెప్పగలిగితే
సులభంగా అర్థమవుతుంది
అపార్థాలకు తావు మిగలదు
మాట్లాడడం ఒక కళ
భావవ్యక్తీకరణకు
భాష, సంభాషణ
భూషణాలు.
అవతలివారు చెప్పే మాట
ఓపికగా వినకపోతే
వచ్చేవి అపార్థాలు.
నిన్న నువ్వు చెప్పావు
"మేము నిన్న
షాప్ లో చెప్పు కొన్నాం" అని
అందుకే అడిగా అర్థం కాక
"ఒక్క చెప్పు
ఎందుకు కొన్నారు" అని.
దానికి ముందు
ఆమె చెప్పిన మాట
నువ్వు సరిగ్గా వినలేదు కాబట్టి
నీకు ఆ డౌట్
అందుకే ఈఅపార్థం
ఒక్క చెప్పు ఎవరూ కొనరు గదా!
షాప్ లో వాళ్లు
ఏదో సంగతి చెప్పుకున్నారు.
అది ఆమె చెప్పేటప్పుడు
నువ్వు వినకపోవడం
ఈ అపార్థానికి కారణం.
అపార్థాల వల్ల
కొంపలు మునుగుతాయ్.
కన్ను చూచింది
చెవి విన్నది
సరికాకపోతే
వచ్చే అపార్థం అపారం.
అర్థ మనసుతో వినడం వల్ల
చెప్పాల్సింది
అవకతవకగా చెప్పడం వల్ల
మనకు తెలిసినది
మరింత చేసి
మరొకరికి చేరవేయడం
ఎక్కువగా మాట్లాడడం వగైరాలు
అపార్థాలకు మూల కారణాలు.
మిత భాషణం
సరస సంభాషణం
మాట స్పష్టత
సర్వదా శ్రేయస్కరం
ఫోన్లో మరీజాగ్రత్త.

-డా.సి.వసుంధర

విపరీతార్థం

అర్థం చేసుకోటంలో
తికమక -మకతిక
ఆపై టపటపా
మాటల ఈటెలు విసిరేవారికి
దూరం దూరం
చాలాచాలా దూరం
కోడిగుడ్డుకి ఈకలు పీకే రకాలు
తమకే తెల్సనే అహంతో
చెవులు సరిగా వినపడక
కంటిచూపు ఆనక
ముఖకవళికలు
స్వరంలో తేడాతో
అనుమానంతో అపార్థం.
ఒకే పదం వివిధ భాషల్లో
వేర్వేరు అర్థాలతో రాద్ధాంతం
చేతిసైగలు
అతిమోహం క్రోధంలో
నశించు విచక్షణ.
అమ్మకు నోరువాడి
అయ్యకు చెయ్యివాడి
పుండుమీద కారంజల్లు
ఇకిలించి సకిలించు శాడిస్టులు.
నారదమహర్షిని తంపుల తంటాల
కలహభోజనుడిగా
సినిమాల్లో చూపి చూసిచూసి
అనర్థాలు అపార్థాలు
లోకోపకారం అని ఎరుగని అజ్ఞానులు.
శమంతకమణి ని దొంగిలించాడని
కృష్ణునిపై అభాండాలు
ద్రౌపది నవ్విందని
దుర్యోధనుడి మత్సరం
కుటిలం కుతంత్రాలు
అహల్యకు శాపమిచ్చిన గౌతముడు.
కృష్ణ భక్తిలో తరించిన మీరాబాయి
ఆవేదన తో
"మీరా హోగయా
బావరీ న్యాత్ కహే కులనాశీ"
అపార్థాలతో ఇల్లువిడిచే అప్పాజీ
కనులు పెరికించిన కృష్ణ దేవరాయలు.
ఉమ్మడి కుటుంబాల్లో
అత్తాకోడలు ఆడపడుచులమధ్య
అపార్థాల పర్వాలు
ఎలుక పిల్లిమీద పెట్టి
గరిటెలు కుండల ధమధమలు
పిల్లల వీపులపై విమాన మోతలు.
రాజకీయాల్లో ఔను కాదు
షరామామూలే
కానీ నేడు కొత్తగా
ప్రవచనకర్తలపై
బురదచల్లే యత్నాలు
ఇమేజ్ ని దెబ్బ తీసే
అవాకులు చెవాకుల పేలుళ్లు
రకరకాల అపోహలు అపార్థాలకి
దారితీసే దుశ్చర్యలు.
అసూయ ఈర్ష్య ద్వేషం కసి
ఇన్ఫీరియార్టీ కాంప్లెక్స్ తో మసి
కట్టివంకర పొయ్యతీసిన పగిది
నిజం నిగ్గు దేలుబి
అపార్థాలకి తెరపడు.

-ఎ.రాజ్యశ్రీ

మనస్తాపం

అర్థం -అపార్థం
మధ్య అక్షరమే తేడా
కల్పించే అనర్థాలు ఎన్నో
సృష్టించే సమస్యలు అనంతం
కలిగించే మనస్తాపం నిరంతరం
అర్థం చేసుకుంటే అన్యోన్యం
అపార్థం చేసుకుంటే మనస్తాపం
అర్థం చేసుకుంటే ఆప్తుడు
అపార్థం చేసుకుంటే శత్రువు
అర్థం చేసుకునేవారుంటే
ఏమీ లేకున్నా లేమి తెలియదు
జీవితమే స్వర్గం
అపార్థం చేసుకునే వారుంటే
అన్ని వున్నా నరకమే
అవగాహనా రాహిత్యమే
అనర్థానికి మూలం.

-మోటూరి శాంతకుమారి

భిన్న ఆలోచనలు

తొందర పాటు
వినే మాటలు
చెప్పుడు మాటలు
అపార్థాలకు దారి
సూక్ష్మబుద్ధి తో ఆలోచించు
అపార్థం పెంచి
శత్రుత్వం అపార్థం కొని తెచ్చుకోకు
కష్టాల మూలం
త్రుంచు బంధాలు
ఆలుమగల మధ్య అపార్థాలు
సంసారానికి చేటు
అర్థం చేస